



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 322 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 11-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం

**అమెరికాతో చర్చల ప్రసక్తే లేదన్న ఇరాన్**




- ఆస్తులు, ఆయుధ నిల్వపై వైమానిక దాడులు
- లెబనాన్‌లో పలువురిని హతమార్చిన ఐడీఎఫ్
- బాలిస్టిక్ క్షిపణిని కుల్చేసిన సౌదీ అరేబియా
- ఇరాన్ ప్రజల చేతుల్లోనే రాజకీయ భవిష్యత్తు
- ఇరాన్ విముక్తి ఆ దేశ ప్రజల చేతుల్లోనే ఉంది
- ఇరాన్ లో నిరంకుశ పాలన రాజ్యమేలుతుంది
- ఇరాన్ పై ఇంకా మా యుద్ధం కొనసాగుతుంది
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యలు

## లెబనాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

**లెబనాన్,**

పశ్చిమాసియాలో యుద్ధం అంతకంతకూ తీవ్రమవుతోంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్‌కు చెందిన ఐడీఎఫ్ విరుచుకుపడింది. లెబనాన్‌లోని హెజ్‌బొల్లాకు చెందిన అల్ క్వార్డ్ అల్ హసన్ అసోసియేషన్ ఆస్తులు, ఆయుధ నిల్వ సౌకర్యాలపై వైమానిక దాడులు చేపట్టింది. హెజ్‌బొల్లా సైనిక సామర్థ్యాలను మరింత దెబ్బతియడానికి ఈ దాడులను ఐడీఎఫ్ చేసింది. ఈ మేరకు ఐడీఎఫ్ ఎక్స్ పోస్టులో పేర్కొంది.అలాగే లెబనాన్ రాజధాని బీరూట్‌లో కచ్చితమైన దాడులు జరిపినట్లు మరో ఎక్స్ పోస్టులో ఐడీఎఫ్ పేర్కొంది. ఈ దాడుల్లో లెబనాన్ కార్ప్స్‌లోని ఐదుగురు సీనియర్ కమాండర్లను హతమార్చినట్లు తెలిపింది. "లెబనాన్ కార్ప్స్ కమాండర్ దావూద్ అలీ జాదే, లెబనాన్‌లోని ఇరాన్ కుద్‌ఫోర్స్ శాఖలకు నిధులను బదిలీ చేసే మాజిద్ హసిని, లెబనాన్ కార్ప్స్ ఇంటెలిజెన్స్ సెక్టార్ కమాండర్ అలీ రెజా అజార్, లెబనాన్ కార్ప్స్‌లో ఇంటెలిజెన్స్ ఆపరేటివ్ హసన్ అహ్మద్‌ను

-మిగతా 2 లో





## బెంగాల్లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

- ఈసీ ఆదేవాల మేరకే ఉద్యోగులు పనిచేయాలి
- అర్హులైన ఏ ఒక్కరి పేరూ తొలగించలేదు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్

**కోల్‌కతా**

ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఏ ఒక్క ఓటరును తొలగించేది లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా ఎన్నికలు జరపడానికే ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఎన్నికల పక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈసీ ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందని, ఎలాంటి లోటుపాట్లను సహించేది లేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో వరుస సమావేశాల అనంతరం మీడియాతో సీఈసీ మంగళవారంనాడు మాట్లాడారు.పశ్చిమబెంగాల్‌లో 80,000 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వీటిలో 61,000 బూత్‌లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయని సీఈసీ చెప్పారు. ఓటింగ్ పక్రియలో పారదర్శకత, అవకతవకల నిరోధానికి అన్ని పోలింగ్ బూత్‌లలో వెబ్‌కాస్టింగ్ పక్రియ అమలు చేస్తామని తెలిపారు. రాజ్యాంగం ప్రకారమే ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించామని, పూర్తిగా పారదర్శకతంగా జరిగిందని తెలిపారు. ఢిల్లీ వెళ్లిన తర్వాత ఎన్నికల కమిషన్ సమీక్షా సమావేశం జరుపుతుందని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో హింస మరియు బెదిరింపులకు తావు లేకుండా ఎన్నికలు జరిగేలా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణపై ఇసి రెండు రోజుల

-మిగతా 2 లో

# దేశంలో గ్యాస్ కొరత

**ముంబైలో 20 శాతం హోటళ్లు, రెస్టారెంట్‌లు మూత**


- యుద్ధంతో చమురు, గ్యాస్ కొరత
- వాణిజ్య సిలిండర్ సరఫరాకు అంతరాయం
- దేశవ్యాప్తంగా ఆగిపోయిన గ్యాస్ సరఫరా..
- ఢిల్లీ, ముంబై, బెంగళూరులో మరింత తీవ్రతరం
- తెలంగాణలోను బంద్ దిశగా హోటళ్లు
- సంక్షోభంలో మూతపడుతున్న హోటల్ ఇండస్ట్రీ

**న్యూఢిల్లీ,**

ఇరాన్–అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధ పరిణామాలను ప్రస్తుతం ప్రపంచం మొత్తం అనుభవిస్తోంది. దీని విస్తృత ప్రభావం ఇప్పటికే చాలా చోట్ల కనిపిస్తోంది. భారత్‌లో పెట్రోలియం, గ్యాస్ పరిస్థితి బాగానే ఉందని ప్రభుత్వం చెబుతోంది, కానీ వాణిజ్య సిలిండర్లు అందుబాటులో లేకపోవడం , గృహ సిలిండర్లపై తప్పనిసరి 25 రోజుల వారంటీ కారణంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీనిని సైడ్ ఎఫెక్ట్ లేదా పుకారు అని పిలిచినా, గ్యాస్ సిలిండర్ గిడ్డంగుల వెలుపల ఇప్పుడు ప్రజల పొడవైన క్యూలు కనిపిస్తున్నాయి.

-మిగతా 2 లో





## పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- త్వరలో ఎంజిఎం హాస్పిటల్ ప్రారంభం
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన
- యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు
- వరంగల్ నగరాభివృద్ధిపై జిల్లా ప్రజాప్రతినిధులు మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష

**హైదరాబాద్,**

వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగాపని చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా అభివృద్ధిపై దేవాదాయ, అటవీ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్‌ను అభివృద్ధి పరచాలన్న కృత నిశ్చయంతో వరంగల్ నగర అభివృద్ధిపై గౌరవ

-మిగతా 2 లో



## లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లపై అవిశ్వాసం

- జగదంబికా పాల్ ప్రత్యేక స్పీకర్‌గా విధులు
- చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపి జావెద్
- విపక్ష నేతను అవమానిస్తూ మాట్లాడేందుకు నిరాకరించారని ఆరోపణ
- కాంగ్రెస్ సంప్రదాయాలు పాటించడం లేదన్న కిరణ్ రిజిజు
- నెహ్రూను తిట్టేవారు ఆయనను జపిస్తున్నారంటూ ప్రియాంక ఎదురుదాడి

**న్యూఢిల్లీ**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం గురించి లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఈ చర్చ కోసం పది గంటల సమయం కేటాయించారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. స్పీకర్ ఓం బిర్లా నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని, ఆయన అధికార పార్టీ భాష మాట్లాడుతున్నారని తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ ఆరోపించారు. అనంతరం అవిశ్వాస తీర్మానంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చర్చను ప్రారంభించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం గురించి చర్చ జరుగుతున్న సమయంలో సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించింది. సీనియర్ ఎంపీ,

-మిగతా 2 లో

## హైదరాబాద్ చేరుకున్న కొత్త గవర్నర్

**శివప్రతాప్ శుక్లాను స్వాగతించిన సీఎం**

**హైదరాబాద్,**

తెలంగాణకు కొత్తగా నియమితులైన నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సిఎం రేవంత్ తదితరులున గవర్నర్‌కు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి,

-మిగతా 2 లో





## త్వరలోనే ఇరాన్ యుద్ధం ముగింపు

- పుతిన్‌తో గంటసేపు ఫోన్లో మాట్లాడిన ట్రంప్
- కీలక అంశాలపై చర్చించిన ట్రంప్, పుతిన్
- ఇరాన్ పూర్తిగా ఓడిపోయే వరకు కొనసాగుతోంది
- యుద్ధం ముగింపుపై ట్రంప్ విరుద్ధ ప్రకటన
- అమెరికా అన్నివిధాలా గెలించిందని వెల్లడి
- ఇరాన్ పెద్ద తప్పు చేసిందని ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్,**

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడారు. వారిద్దరూ దాదాపు గంటసేపు ఫోన్‌లో కీలక అంశాలపై చర్చించారు. అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని త్వరగా ముగించేందుకు పుతిన్ కొన్ని ప్రతిపాదనలు చేసినట్లు క్రెమ్లిన్ వెల్లడించింది. వాషింగ్టన్ చొరవతో జరిగిన ఈ చర్చల్లో యుద్ధాన్ని దౌత్యమార్గాల ద్వారా

-మిగతా 2 లో

## ఆందోళన చేస్తున్న రైతుల అరెస్ట్ దుర్మార్గం

- రంగానాయక్ సాగర్‌పై ఎందుకీ తాత్సారం
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రంగనాయక్ సాగర్ కెనాల్ పనులు పూర్తి చేయాలంటూ నిరసనకు దిగిన రైతులను అరెస్ట్ చేయడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ఖండించారు. సమస్యలపై ఆందోళన చేస్తే అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాప్రభుత్వం తీరు అంటూ విమర్శలు గుప్పించారు. మంగళవారం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు నిరసన చేస్తే వారిని అరెస్ట్ చేస్తారా అంటూ మండిపడ్డారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్,

-మిగతా 2 లో



# పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం

(మొదటి తరువాయి)

హతమార్చాం. " అని పోస్టు చేసింది. మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ సైనిక కార్యాలయ కొత్త అధిపతి అబు అల్ ఖాసిం బాబాయాన్‌ను కూడా హతమార్చినట్లు మరో పోస్టులో ఐడీఎఫ్ తెలిపింది. ఆపరేషన్ రోరింగ్ లయన్‌లో భాగంగా ఈ మెరుపు దాడి జరిగిందని పేర్కొంది. మరోవైపు, గల్ఫ్ ప్రాంతంలోనూ యుద్ధం మరింత తీవ్రమవుతోంది. ఈ క్రమంలో సౌదీ ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరం వైపు ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని అడ్డగించి నాశనం చేశామని సౌదీ అరేబియా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి చెప్పారు. దేశ రాజధాని నగరం రియాద్‌లో ప్రయోగించిన రెండు డ్రోన్‌లను తమ దళాలు కూల్చివేసినట్లు పేర్కొన్నారు.వాషింగ్టన్‌తో దౌత్య చర్చలలో తిరిగి పాల్గొనే అవకాశాన్ని తోసిపుచ్చారు. అమెరికాతో చర్చలు జరపడం అనే ప్రశ్న మరోసారి తలెత్తుతుందని తాను అనుకోవట్లేదని తెలిపారు. ఎందుకంటే అమెరికాతో చర్చలు తమకు చేదు అనుభవాన్ని మిగిల్చాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఓ న్యూస్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. టెహ్రాన్ శత్రువులను ఎదుర్కోవడానికి నిమగ్నమై ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చి స్పష్టం చేశారు. "మేము గతేడాది జూన్‌లో అమెరికాతో చర్చలు జరిపాం. చర్చల మధ్యలో అమెరికా మాపై దాడి చేసింది. ఈ ఏడాది మళ్లీ చర్చలు ప్రారంభించాం. మాపై దాడి చేయాలనే ఉద్దేశ్యం లేదని వారు మాకు హామీ ఇచ్చారు. ఇరాన్‌తో అణు సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకుంటామని, చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొంటామని అన్నారు. దౌత్యపరమైన పురోగతి లభించేటప్పటికే ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా కలిసి దాడులకు దిగాయి. కాబట్టి అమెరికాతో చర్చలు ఇకపై మా అజెండాలో లేవు. " అని సయ్యద్ అబ్బాస్ స్పష్టం చేశారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేనీ ఎంపిక కావడంపైనా సయ్యద్ అబ్బాస్ స్పందించారు. ఈ నియామకాన్ని ఒక రకమైన స్థిరత్వానికి సంకేతంగా అభివర్ణించారు. కొత్త నాయకుడి నిర్దిష్ట విధాన వైఖరి సకాలంలో వెల్లడిస్తారని తెలిపారు. ఈ యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ విఫలమయ్యాయని అన్నారు. "వాస్తవానికి ఇజ్రాయెల్, అమెరికా కొన్ని లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించాయి. అందులో కొన్నింటిని సాధించాయి. రెండు- మూడు రోజుల్లో ఇరాన్‌లో పాలనా మార్పును తీసుకురావొచ్చని అనుకున్నారు. యుద్ధంలో వేగంగా విజయం సాధించవచ్చని భావించారు. కానీ వారు విఫలమయ్యారు. ప్రపంచ ఇంధన సరఫరాల అంతరాయం, చమురు ధరలు పెరగడంలో మా తప్పు లేదు. అది మా ప్లాన్ కూడా కాదు. చమురు ఉత్పత్తి, రవాణా మందగించింది. ఇజ్రాయెల్, అమెరికా మాపై చేసిన దాడులు, దురాక్రమణ కారణంగానే అది జరిగింది. ట్యాంకర్లు, ఓడలు హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లడానికి భయపడుతున్నాయి. మేము ఆ జలసంధిని మూసివేయలేదు." అన్నారు. ఇరాన్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా ఆ దేశ ప్రజల చేతుల్లోనే ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్? నెతన్యాహు అన్నారు. ఇరాన్? ప్రజలపై రుద్దబడిన నిరంకుశ పాలనను అంతం చేయాలన్నదే తమ ఆకాంక్ష అని, అయితే అది ఆ దేశ ప్రజల పోరాటం ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. మంగళవారం నేషనల్? హెల్త్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్? సెంటర్?ను సందర్శించిన సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు."నిరంకుశత్వ సంకెళ్లను తెంచుకునే శక్తిని ఇరాన్ ప్రజలకు కల్పించాలన్నదే మా ఆకాంక్ష. అయితే అంతిమంగా అది ఆ దేశ ప్రజల నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. ఇజ్రాయెల్ ఇప్పటి వరకు చేపట్టిన సైనిక చర్యల వల్ల ఇరాన్ పాలక వ్యవస్థ పూర్తిగా బలహీనపడింది. మేము ఇక్కడితో ఆగము. మా సైనిక చర్యలు ఇంకా కొనసాగుతాయి. మేము ఇరాన్ ప్రజలతో కలిసి విజయం సాధిస్తే, అది ప్రాంతీయంగా శాశ్వతమైన మార్పునకు దారితీస్తుందని అన్నారు. ఇజ్రాయెల్ ఆరోగ్య శాఖా మంత్రి హైమ్ కాట్జ్?తో కలిసి ' నేషనల్ హెల్త్ కమాండ్ సెంటర్?ను నెతన్యాహు సందర్శించిన ఆయనకు, ఆపరేషన్ రోరింగ్ లయన్?లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల గురించి ఆరోగ్య శాఖ డైరెక్టర్? జనరల్ మోషే బార్ సిమాన్ టోవ్ వివరించారు.మరోవైపు యుద్ధం ముగింపు దశకు వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఇరాన్ తోసిపుచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్?ల్లోని లక్ష్యాలపై దాడులను ఎప్పుడు ముగించాలో నిర్ణయించే ఏకైక అధికారం తమకే ఉందని ఇరాన్ స్పష్టం చేసింది. "యుద్ధం ఎప్పుడు ముగియాలో మేము నిర్ణయిస్తాం. ప్రాంతీయ సమీకరణాలు, భవిష్యత్ స్థితిగతులు ఇప్పుడు మా సాయుధ దళాల చేతిలో ఉన్నాయి. అమెరికా దళాలు ఈ యుద్ధాన్ని ముగించలేవు" అని ఐఆర్?జీసీ ఘాటు వ్యాఖ్యలు చేసింది. అంతేకాదు గతంలో ఎదుర్కొన్న ఘోర పరాజయాలను కప్పిపుచ్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్? కుట్రలు, మోసపూరిత మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ఇంతకు ముందు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియా ఉద్రిక్తతల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం చాలా వరకు పూర్తైందని, గతంలో అంచనా వేసిన దానికంటే త్వరగా (నాలుగైదు వారాల్లోగా) యుద్ధం ముగిస్తుందని పేర్కొన్నారు. ఇరాన్‌కు ఇప్పుడు నేవీ, ఎయిర్‌ఫోర్స్, కమ్యూనికేషన్ వ్యవస్థలు లేవని, వారి క్షిపణులు సర్వనాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. కానీ, కొన్ని గంటల తర్వాత ట్రంప్ తన మాట మార్చారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 'ఇరాన్‌తో చేస్తున్న యుద్ధంలో అమెరికా అన్ని విధాలా పై చేయి సాధించిందని, కానీ ఇంకా పూర్తి స్థాయిలో గెలవలేదని చెప్పుకొచ్చారు.

# దేశంలో గ్యాస్ కొరత

(మొదటి తరువాయి)

రాజధాని బెంగళూరు వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరతను ఎదుర్కొంటోంది. నగరంలోని ఆహార పరిశ్రమతో పాటు, రోజూ బయట భోజనం చేసే వారు కూడా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ నగరం అంతటా హోటళ్ళు రేపటి నుంచి మూసివేస్తున్నట్టు ప్రకటించింది. సిలిండర్లు ప్రస్తుతం స్టాక్‌లో ఉన్నందున కొన్ని హోటళ్ళు ఈరోజు తెరిచి ఉన్నాయి. స్టాక్ అయిపోయిన తర్వాత, గ్యాస్ సరఫరా లేకపోవడం వల్ల హోటళ్ళు మూసివేస్తున్నారు. చాలా ప్రధాన హోటళ్లలో కొన్ని గంటల సరఫరా మాత్రమే మిగిలి ఉంది. రాబోయే మూడు రోజులు గ్యాస్ కొరత కొనసాగితే, ముంబైలోని 50% హోటళ్ళు మూతపడే అవకాశం ఉందని హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. ముంబైలోని డోంగ్రి ప్రాంతంలోని అన్ని హోటళ్ళు మూసివేశారు. ఢిల్లీలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలోని గిడ్డంగిలో ఖాళీ వాణిజ్య సిలిండర్లు పడి ఉన్నాయి. గత రెండు రోజులుగా వాణిజ్య సిలిండర్ల సరఫరా లేదు. వాణిజ్య సిలిండర్లు ప్రస్తుతం రావని పై వారికి సమాచారం ఇచ్చామని ఇన్‌ఛార్జ్, మేనేజర్ చెబుతున్నారు. "డొమెస్టిక్ బుకింగ్‌లు మాత్రమే సరఫరా అవుతున్నాయి. హోటల్ యజమానులు వస్తున్నారు, కానీ వద్ద సిలిండర్లు లేవు. మేము ప్రతిరోజూ 60 నుంచి 70 వాణిజ్య సిలిండర్లను సరఫరా చేసేవాళ్ళం, కానీ గత రెండు రోజులుగా స్టాక్ లేదని మేనేజర్ చెబుతున్నారు. ఖాళీ వాణిజ్య సిలిండర్లు ఇక్కడ పడి ఉన్నాయి. నిండినవి రాకపోతే అవి ఇక్కడే ఖాళీగా పడి ఉంటాయి." గ్యాస్ కొరత లక్నోలో కూడా ఉంది. గ్యాస్ ఏజెన్సీల ముందు పెద్ద ఎత్తున జనం క్యూలు కడుతున్నారు, కానీ గ్యాస్ సరఫరాలు అందడం లేదు. కొత్త గ్యాస్ బుకింగ్‌లు ఇప్పుడు ఆగిపోయాయని ప్రజలు చెబుతున్నారు. కొంతమందికి ఒక నెల క్రితం గ్యాస్ బుకింగ్‌లు ఉన్నాయని, మరికొందరు రెండు నెలల క్రితం గ్యాస్ బుకింగ్‌లు చేశారని, ఇప్పుడు కొత్త గ్యాస్ బుకింగ్‌లు ఊరాజ నంబర్‌ను చూపించడం లేదని చెబుతున్నారు. చండీగఢ్‌లోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ గిడ్డంగిలో పెద్ద సంఖ్యలో వాణిజ్య గ్యాస్ సిలిండర్లు కనిపిస్తున్నాయి. సిబ్బంది చెప్పిన వివరాలు చూస్తే, గత నాలుగు రోజులుగా వాణిజ్య సిలిండర్ల సరఫరా లేదు, దీని కారణంగా వస్తున్న సిలిండర్లను ఇక్కడ ఉంచున్నారు. ఉద్యోగి సోను ప్రకారం, హోటల్, రెస్టారెంట్ యజమానులు సిలిండర్ల గురించి అడుగుతున్నారు. కానీ మా దగ్గర సిలిండర్లు అందుబాటులో లేవు. అతని ప్రకారం, దేశీయ గ్యాస్ సరఫరా కూడా సగానికి తగ్గించారు.మధ్యప్రదేశ్‌లో కూడా వాణిజ్య గ్యాస్ సిలిండర్లను నిషేధించారు. రాజధాని భోపాల్‌లోని హోటళ్ల యజమానులు వాటిని పొందలేకపోతున్నారు. నిన్న సాయంత్రం నుంచి, భోపాల్‌లోని రెస్టారెంట్లు, హోటళ్లు, దుకాణాలకు సామాగ్రి అందలేదు. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారతీయ వంటగదిపై, ముఖ్యంగా హోటల్ రంగంపై పెను ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్ వివాదం కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతినడంతో దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ కొరత మొదలైంది. దేశవ్యాప్తంగా హోటల్స్ మూతపడుతున్నాయి. నిత్యం కస్టమర్లతో కిటకిటలాడే హోటల్స్ తయారీని పరిమితం చేసుకుంటున్నాయి. గ్యాస్ లేకపోవడంతో వంటలు చేయలేక, హోటల్ యాజమాన్యాలు తమ కస్టమర్లకు కేవలం కుర్మా, సాంబార్ వంటి ముందే సిద్ధం చేసిన పదార్థాలను మాత్రమే వడ్డిస్తున్నాయి. నేటికి ఎలాగోలా సర్దుబాటు చేశాంకానీ, రేపటి నుంచి గ్యాస్ లేకపోతే హోటల్ నడపడం అసాధ్యం అని హోటల్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక్క హోటల్ పరిస్థితి మాత్రమే కాదు దేశవ్యాప్తంగా వందలాది హోటళ్లు ఇదే కారణంతో మూతపడే దిశగా వెళ్తున్నాయి. గల్ఫ్ దేశాల నుండి రావాల్సిన గ్యాస్ నిలిచిపోవడంతో బల్క్ సరఫరాపై ఆధారపడే కమర్షియల్ హోటల్ రంగం కుప్పకూలుతోంది. భారతదేశం తన ఎల్‌పీజీ అవసరాలలో దాదాపు 40 నుంచి 45 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో సింహభాగం ఇరాన్, యూఏఈ, కతార్ వంటి దేశాల నుంచే వస్తుంది. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల సరఫరా నిలిచిపోవడంతో, కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కోటాపై తీవ్రమైన ఆంక్షలు విధించారు. హోటల్ అసోసియేషన్లు వెల్లడిస్తున్న సమాచారం ప్రకారం, మెట్రో నగరాల్లోని చిన్న, మధ్యతరహా హోటళ్లు గ్యాస్ అందక సగానికి పైగా మెనూని తగ్గించేశాయి. మరికొన్ని చోట్ల కట్టెల పొయ్యిలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సంక్షోభం కేవలం వంట గ్యాస్ కొరతకే పరిమితం కాకుండా, ధరల పెరుగుదలకు కూడా దారితీస్తోంది. అందుబాటులో ఉన్న కొద్దిపాటి గ్యాస్‌ను బ్లాక్ మార్కెట్‌లో భారీ ధరలకు విక్రయిస్తుండటంతో హోటల్ నిర్వాహకులపై ఆర్థిక భారం పెరుగుతోంది. ఇది చివరకు సామాన్యుడి కంచంపై ప్రభావం చూపుతోంది. హోటళ్లలో టిఫిన్, భోజనాల ధరలు ఇప్పటికే 20% వరకు పెరిగాయి. యుద్ధం గనుక సుదీర్ఘకాలం కొనసాగితే, విమానయాన, రవాణా రంగాల తర్వాత అత్యంత దెబ్బతినేది హోటల్, క్యాటరింగ్ రంగమేనని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గ్యాస్ నిల్వలను సమకూర్చుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. చెన్నై నుంచి ఢిల్లీ వరకు ప్రతి వీధిలోని హోటల్ యజమాని ఇప్పుడు యుద్ధం ఎప్పుడు ఆగుతుందా అని ఆకాశం వైపు చూస్తున్నారు. గ్యాస్ సిలిండర్ రాక ఆగిపోతే, వేలమంది కార్మికుల ఉపాధి దెబ్బతినడమే కాకుండా, దేశీయ ఆహార రంగం సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ కొరతపై డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి స్పందించారు. మన రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎల్పీజీ కొరత వచ్చే అవకాశం లేదని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇబ్బందులు ఎదురవకుండా మాత్రమే కేంద్రం అప్రమత్తమైందని తెలిపారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం ముందస్తు చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే వ్యాపార, హోటల్స్‌కు సిలిండర్లను నిలుపుదల చేస్తూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి.డిస్ట్రిబ్యూటర్ల నుంచి 19 కిలోల వాణిజ్య సిలిండర్ల సరఫరా దాదాపు ఆగిపోయింది. హాస్టళ్లకు, ఆస్పత్రులు లాంటి అత్యవసర విభాగాలకు ఎస్మా నుంచి మినహాయింపును ఇచ్చారు. గ్యాస్ సరఫరా విషయంలో కొన్ని విభాగాలకు పరిమితులు విధించారు. యుద్ధం కారణంగా సరిపడినంత గ్యాస్ సరఫరా లేకపోవడంపై ఉన్నత స్థాయిలో కమిటీ ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న గ్యాస్ ఏయే రంగాలకు సరఫరా చేయాలన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. కమిటీ సిఫారసుల మేరకు ఆయిల్ కంపెనీలు గ్యాస్ సరఫరాను కొనసాగించనున్నాయి. గృహ వినియోగదారులు గ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలని, అవకాశం ఉన్నంత వరకు ఇండక్షన్ స్టవ్ లాంటి వాటిని వాడుకోవాలని అధికారులు సూచించారు.

# త్వరలోనే ఇరాన్ యుద్ధం ముగింపు

(మొదటి తరువాయి)

పరిష్కరించుకోటంపై ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపింది. ఉక్రెయిన్ యుద్ధం, వెనెజువెలా అంశాలు కూడా ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చినట్లు క్రెమ్లిన్ తెలిపింది. ఈ చర్చలు యుద్ధ వాతావరణాన్ని తగ్గించేందుకు ఉపయోగపడతాయని భావిస్తున్నట్లు రష్యా తెలిపింది. మరోవైపు ఇరాన్‌పై యుద్ధం చాలా వరకు పూర్తైందని, గతంలో అంచనా వేసిన నాలుగైదు వారాల కన్నా ముందే ముగిసిపోతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఇరాన్‌కు ఇప్పుడు నేవీ, ఎయిర్‌ఫోర్స్, కమ్యూనికేషన్లు లేవని, వారి క్షిపణులు చెల్లాచెదురుగా పడుతున్నాయని తెలిపారు. ఆసియాకప్‌లో పాల్గొన్న ఇరాన్ మహిళా ఫుట్‌బాల్ జట్టును స్వదేశానికి పంపవద్దని ఆస్ట్రేలియాను కోరారు. వారికి అక్కడే ఆశ్రయం కల్పించాలని సూచించారు. లేకుంటే అమెరికా వారిని చేరదీస్తుందని ట్రంప్ అన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీని ఎంపిక చేయడంపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో ఇరాన్ పెద్ద తప్పు చేసిందన్నారు. మొజ్తబా ఎంతకాలం పదవిలో కొనసాగుతారో తెలియదని, ఐతే ఆయన ఎంపిక సరైన నిర్ణయం కాదని తాను భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. తన మనసులో మొజ్తబా ఖమేనీకి బదులుగా మరొకరు ఉన్నారని వివరించారు. అణు కార్యక్రమాలు, క్షిపణి పరీక్షలు ఆపాలన్న అమెరికా డిమాండ్‌ను అంగీకరించకుంటే మొజ్తబాను లక్ష్యంగా చేసుకోవడానికి వెనుకాడబోమని ట్రంప్ తన సన్నిహితుల్తో అన్నట్లు అమెరికా మీడియా తెలిపింది. అటు ఇరాన్ చమురు క్షేత్రాలను ఆధీనంలోకి తీసుకోవడం గురించి ఇప్పుడే మాట్లాడితే తొందరపాటు అవుతుందన్నారు.మరోవైపు ఇంధన ధరలు నియంత్రించే క్రమంలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. కొన్ని రకాల చమురు ఆంక్షలను తొలగించనున్నట్లు వెల్లడించారు. యుద్ధం నేపథ్యంలో ముడి చమురు ధరలు పెరగకుండా, నిరంతర సరఫరా కొనసాగడానికి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ వివరించారు. 'మేము కొన్ని దేశాలపై ఆంక్షలు విధించాం. పరిస్థితి సాధారణ స్థితికి వస్తే మేము ఆ ఆంక్షలు తొలగిస్తాం' అని చెప్పారు. అయితే, దీనికి సంబంధించి పూర్తి వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లే చమురు ట్యాంకర్లకు తమ నౌకాదళాలు, భాగస్వాములు కలిసి రక్షణ కల్పిస్తాయని ట్రంప్? పేర్కొన్నారు. సైనిక చర్య చేపడితే చమురు ధరలు పెరుగుతాయని తనకు ముందే తెలుసని, అయితే, ఇరాన్ అణు క్షిపణులు సమకూర్చుకోకూడదనే తాను ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇక, చమురు సరఫరాను అడ్డుకునేందుకు ఇరాన్ ప్రయత్నిస్తే దానిపై భీకర దాడి చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. 'ఇరాన్ ప్రభుత్వం ప్రపంచాన్ని ఇబ్బందిపెట్టేందుకు చమురు రవాణాను అడ్డుకోవడానికి ప్రయత్నించడాన్ని నేను అస్సలు సహించను. ఒకవేళ వారు అలా చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవు' అని ట్రంప్ వెల్లడించారు. మరోవైపు ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం ముగింపు విషయంపై ట్రంప్ విరుద్ధ ప్రకటనలు చేశారు. యుద్ధం చివరిదశకు చేరుకుందని, అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన ఈ సైనిక చర్య చాలావరకు పూర్తయ్యిందని చెప్పారు. కానీ, కొన్ని గంటల తర్వాత జరిగిన మరో కార్యక్రమంలో ఇదే విషయంపై ట్రంప్ మరోరకంగా స్పందించారు. ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా అన్నివిధాలా గెలిచిందని, కానీ ఇంకా తగినంత గెలవలేదని చెప్పుకొచ్చారు. ఇరాన్ పూర్తిగా ఓడిపోయే వరకు యుద్ధం కొనసాగుతోందని స్పష్టం చేశారు.

## బెంగాల్లో ప్రశాంతంగా
# ఎన్నికల నిర్వహణ

(మొదటి తరువాయి)

పాటు సమీక్ష సమావేశాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని చట్ట అమలు సంస్థలు భయం లేదా పక్షపాతం లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఓటింగ్ శాతం అధికంగా ఉందని, ఓటర్లు మరియు ప్రజలు రాజ్యాంగాన్ని గౌరవిస్తారని అన్నారు. శాంతియుతంగా, స్వేచ్ఛాయుతమైన వాతవారణంలో పోలింగ్ జరిగేలా చూడాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాగా, ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించేందుకు వచ్చిన సీఈసీకి మంగళవారంనాడు కూడా నిరసనల సెగ తప్పలేదు. మంగళవారం ఉదయం దక్షిణేశ్వర్ కాళి ఆలయాన్ని సందర్శించేందుకు ఆయన వచ్చినప్పుడు కొందరు నల్లజెండాలతో నిరసన తెలుపుతూ 'గో బ్యాక్' నినాదాలు చేశారు. ఆదివారం రాత్రి సీఈసీ రాక సందర్భంగా నేతాజి సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం బయట కూడా ఇలాంటి నిరసన ప్రదర్శనలు చేటుచేసుకున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం విడుదల చేసిన ఓటర్ల తుదిజాబితా నుంచి పక్షపాత ధోరణితో పెద్దఎత్తున పేర్లు తొలగించారని నిరసన ప్రదర్శకులు ఆరోపిస్తున్నారు.

# పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

(మొదటి తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల అమలులో వేగం పెంచాలని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన వివిధ ప్రగతి పనులు వచ్చే జూన్ 2వ తేదీ కల్లా పూర్తి కావాలని, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా ప్రారంభించేందుకు నిర్విరామంగా పనిచేయాలని సూచించారు. భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు, భద్రకాళి చెరువు డీ సిల్టేషన్ అంశాలకు సంబంధించి ఆలయ మాడవీధులలో కృష్ణశిలతో నిర్మాణం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రకాళి చెరువు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఇన్ ఫాల్ అవుట్ ఫాల్ విషయంలో భూ సేకరణను వేగవంతం చేయాలన్నారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా శంకుస్థాపన చేసి గాలికి వదిలేసిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను పూర్తి చేశామని జూన్ నాటికి ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు ఈ ఆసుపత్రి నిర్మాణ పనులు, ఆసుపత్రి సామగ్రి ఏర్పాటు, డాక్టర్ల నుంచి మొత్తం సిబ్బంది నియామకానికి సత్వరమే కార్యాచరణను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్డుకు అదేవిధంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. వరంగల్ పట్టణంలో 5,257 కోట్ల రూపాయిలతో చేపట్టే భూ గర్భ డ్రైనేజీ పనులకు సంబంధించి వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి వచ్చేనెలలో పనులను ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న 2 బిహెచ్‌కే ఇండ్లకు ఈనెల 31లోగా లబ్దిదారులను ఎంపిక చేసి కేటాయించాలని సూచించారు. 2బిహెచ్‌కే కాలనీల్లోకరెంట్, డ్రైనేజ్, తాగునీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలను ఆనాటి ప్రభుత్వం విస్మరించిందని తక్షణమే ఆయా కాలనీల్లో కనీస వసతుల ఏర్పాటు చేయాలని ఇందుకు అవసరమైన బ్జడెట్ ప్రతపాదనలు పంపిస్తే నిధుల మంజూరు చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, నాయిని రాజేందర్, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హన్మకొండ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ చేరుకున్న కొత్త గవర్నర్

(మొదటి తరువాయి)

ఇతర ఉన్నతాధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికి వారిలో ఉన్నారు. అనంతరం గవర్నర్ నేరుగా లోక్‌భవన్ చేరుకున్నారు.

# లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లపై అవిశ్వాసం

(మొదటి తరువాయి)

చైర్ పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను నియమించింది. ఆయన నేతృత్వంలో ప్రస్తుతం స్పీకర్ ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టారు. ప్రతిపక్షాల తరపున కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం సహా పలు అంశాలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి మాట్లాడేందుకు యత్నించారని, కానీ స్పీకర్ అనుమతినివ్వలేదని అన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో సుమారు 200మంది సభ్యులున్నప్పటికీ.. డిప్యూటీ స్పీకర్ లేరని అన్నారు. డిప్యూటీ స్పీకర్ లేకుండా సభ ఎలా నడుస్తుందో దేశ ప్రజలు చూడాలని అన్నారు. మైక్‌ని కూడా ఆయుధంగా వినియోగి స్తున్నారని అన్నారు. ఎన్‌డిఎ సభ్యులకు మాట్లాడేందుకు అనుమతినిస్తున్నారని, కానీ ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు మైక్‌ని ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభలో హుందాగా మెలగడం లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఈ క్రమంలో గతంలో ప్రధాని మోదీని రాహుల్ ఆలింగనం చేసుకున్న ఘటనను ప్రస్తావించారు. ప్రధాని మోదీ దగ్గరకు వచ్చిన రాహుల్.. ఆలింగనం చేసుకొని వెళ్లి తన సీట్లో కూర్చున్నారు. అనంతరం తోటి ఎంపీలను చూసుకుంటూ కళ్లు ఎగరవేశారు. అటువంటి నేతను ఎప్పుడూ చూడలేదు' అని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో నెహ్రూ చెప్పిన నాటి స్పీకర్ జీవీ మావలాంకర్‌ను సమర్థిస్తూ మాటలను గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. దీనిపై దీటుగా స్పందించిన ప్రియాంకా గాంధీ.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.రిజిజు విమర్శలను ఎంపీ ప్రియాంకా గాంధీ తిప్పికొట్టారు. విపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పే విషయాలను అధికార పక్షం జీర్ణించుకోలేక పోతోందన్నారు. గడిచిన 12 ఏళ్లలో ప్రభుత్వానికి దీటుగా నిలిచిన వ్యక్తి రాహుల్ ఒక్కరేనని అన్నారు. నెహ్రూను ఎప్పుడూ విమర్శించే వాళ్లు అకస్మాత్తుగా ఆయన్ను ప్రశంసించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అందుకే తనకు నవ్వు వస్తోందన్నారు. నిరంతరం నెహ్రూను ఆడిపోసుకుంటున్న వారు ఆయన గురించి మాట్లాడంతో నవ్వు ఆపుకోలేక పోయానని అన్నారు. అయితే, ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ సభలో లేని సమయంలో ఈ చర్చ జరిగింది. ఆ సమయంలో స్పీకర్ స్థానంలో టిడిపికి చెందిన తెన్నేటి కృష్ణప్రసాద్ ఉన్నారు.

# ఆందోళన చేస్తున్న రైతుల అరెస్ట్ దుర్మార్గం

(మొదటి తరువాయి)

తంగళ్లపల్లి మండలానికి నీళ్లిచ్చే కాలువ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని కేంద్రమంత్రి ప్రశ్నించారు. రూ.3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. కాలువ పనులు పూర్తి చేసి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రంగనాయక్ సాగర్ ద్వారా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ రైతు ద్రోహి అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల వైఫల్యాల వల్ల రైతులు వరుసగా పంటలు నష్టపోతున్నారని కేంద్రమంత్రి అన్నారు. తక్షణమే పనులు ప్రారంభించకపోతే ఆయా ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. న్యాయం చేయాలని అడిగిన రైతులను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. రైతులకు సంఘీభావం తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపీ సహా పార్టీ నాయకులను స్టేషన్‌కు తరలించడం అక్రమమని కేంద్రమంత్రి తీవ్రంగా మండిపడ్డారు. రైతులపై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తక్షణమే రైతులను, బీజేపీ నేతలను బేషరతుగా విడుదల చేయాలన్నారు. రంగనాయక్ సాగర్ 11వ ప్యాకేజీ నుంచి ఎల్ఎం 4, ఎల్ఎం 6 ద్వారా కాలువ పనులను పూర్తి చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# కాకతీయ రాజులను ఎదిరించిన సమ్మక్క సారలమ్మలే మనకు స్ఫూర్తి

-మహిళా దినోత్సవ వేడుకలు.
-విద్యా, ఉద్యోగ రంగాలలో ఆడపిల్లలే ముందు వరుసలో నిలుస్తున్నారు.
-ఎమ్మెల్యే బాలు నాయక్.






**దేవరకొండ మార్చి 10. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సతీసమేతంగా కలిసి పాల్గొని, రిటైర్డ్ మహిళా ఉద్యోగుల ను శాలువాతో సత్కారించి, శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ,సతీమణి జ్యోతి ప్రసన్న బాలు నాయక్. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ దేశంలో అయితే మహిళలకు సమానత్వం, సాధికారత లభిస్తుందో ఆ దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రిటైర్డ్ ఉద్యోగుల మహిళా మణులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఏ సమాజంలో అయితే మహిళలు సామజికంగా, ఆర్థికంగా ముందడుగు వేస్తారో ఆ సమాజం అభివృద్ధి చెందుంతుందని అన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా మహిళలను గౌరవించాలని అనేక పోరాటాలు జరిగాయాని తెలిపారు. మన దేశంలో సావిత్రి భాయి పూలె, రాష్ట్రంలో దుర్గా భాయ్ దేశ్ ముఖ్ వంటి వారు మహిళలు బాలికల విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారని వెల్లడించారు. కాకతీయ రాజులకు ఎదురు తిరిగిన వీరవనితలు సమ్మక్క, సారలమ్మ లను స్ఫూర్తిగా తీసుకోవాలని, తన భూమిని కాపాడుకోవడం కోసం భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలకు అవకాశం ఇస్తే ఏదైనా సాధిస్తారని అన్నారు. మహిళా సాధికారతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతుందని తెలిపారు. రాష్ట్రంలో అమలయ్యే అన్ని సంక్షేమ పథకాలు మహిళల పేరుమీదనే ఉన్నాయని అన్నారు. మహిళా సంక్షేమని ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణి వంటి అనేక పథకాలు అందిస్తుందని వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటిశ్వరులను చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులు, సోలార్ యూనిట్లు, పౌల్ట్రీ ఫామ్ లు, ఇతర చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తున్నారని,విద్యా, ఉద్యోగ రంగాలలో ఆడపిల్లలే ముందు వరుసలో నిలుస్తున్నారని తెలిపారు. మహిళలు పారిశ్రామికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్, రిటైర్డ్ ఉద్యోగుల అధ్యక్షులు టీ.నర్సింహా, కార్యదర్శి చంద్రమౌళి,రిటైర్డ్ ఉద్యోగులు, మహిళామణులు తదితరులు పాల్గొన్నారు.


# గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయం ముందు టీపీటీఎఫ్ నిరసన





**హైదరాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గిరిజన సంక్షేమశాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో మాసాబ్‌ట్యాంక్‌లోని కమిషనర్ కార్యాలయం ముందు వందలాది మంది ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ ర్యాలీగా కార్యాలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ జి. హరగోపాల్ మాట్లాడుతూ, "గత ప్రభుత్వ పాలనలో విధ్వంసం అయిన విద్యారంగాన్ని కాపాడుతానన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు ఆచరణలో కనబడకపోవడం గర్హనీయం" అని అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ, మూడు దశల పోరాట కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టామని, సమస్యలు పరిష్కరించకపోవడంతో నేడు నిరసనకు దిగామని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 232 తెలుగు పండిట్, 101 హిందీ పండిట్, 90 పీఈటీ పోస్టులను వెంటనే స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉన్నతీకరించాలని, 423 గ్రేడు--2 పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.అదేవిధంగా ఇరవై సంవత్సరాలుగా అరకొర వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్లను రెగ్యులరైజ్ చేసి, టైమ్‌స్కేల్ వర్తింపజేసి, వేతనాలు సమయానికి చెల్లించాలని కోరారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, ఆశ్రమ పాఠశాలలను 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసి, అన్ని సబ్జెక్టుల టీచర్లను నియమించాలని, ప్రత్యేక టీఆర్టీ నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.పాఠశాలల్లో కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని, వసతి గృహాలకు హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పోస్టులు మంజూరు చేయాలని, అన్ని జిల్లాల్లో ఒకే విధమైన పరిపాలన, అకడమిక్ విధానం అమలు చేయాలని వారు కోరారు.ఈ నిరసనలో రాష్ట్ర కమిటీ సభ్యులు, పూర్వ అధ్యక్షులు, అకాడమిక్ సెల్ కన్వీనర్లు, ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, గిరిజన పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లక్ష్య సాధనలో వెనుకడుగు వేయొద్దు

- సీఐ జానకి రామ్ రెడ్డి
- ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము





**ఆమనగల్లు, మార్చి 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని సీఐ జానకి రామ్ రెడ్డి, ప్రముఖ సంఘ సేవకులు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని వివేక విద్య భారతి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సీఐ జానకి రామ్ రెడ్డి, కౌన్సిలర్ పాపిశెట్టి రాము, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించాలన్నారు. లక్ష్య సాధనలో ఎలాంటి ఒడిదుడుకులు ఎదురైనా వెనకడుగు వేయరాదన్నారు. పాఠశాలను వదిలి వెళ్లనున్న పదవ తరగతి విద్యార్థులు భవిష్యత్లో ఉన్నత స్థానానికి ఎదిగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పరీక్షలంటే భయపడకుండా ప్రణాళికతో చదివి అత్యుత్తమ మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉర్రూత లూగించారు. కార్యక్రమంలో ఎస్ఐ సీతారాం రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ గోలీ శ్రీనివాస్, ప్రిన్సిపల్ మహమూద్, అవ్వారి శివలింగం, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మైనంపల్లి లో ప్రజాపాలన ప్రగతి పాలన ప్రతిజ్ఞ

సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్.



**దేవరకొండ మార్చి 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మండలం, మైనంపల్లి గ్రామంలో సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం డ్రైనేజీలను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ వేయించారు .అదేవిధంగా గ్రామంలో చెత్తను రోడ్డుపై వేయవద్దని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటాము అని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు కొర్రరాంసింగ్ నాయక్,ఉప సర్పంచ్ లాలూ నాయక్,వార్డు సభ్యులు సునీత బద్దు,కిషన్ నాయక్,సంతు వెంకట్,స్నేహ వినోద్,పంచాయతీ కార్యదర్శి అంబెడ్కర్,ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, జగదీష్, అంగన్వాడీ టీచర్ కమలమ్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

-- మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్




**షాద్‌నగర్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో 5, 6, 7, 10, 12, 15, 17, 23, 24, 25, 28వ వార్డులకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందిస్తాం. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని పేర్కొన్నారు. వైస్‌చైర్మన్ అంధే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ అలీ ఖాన్, తహశీల్దార్ నాగయ్య, కౌన్సిలర్లు అగ్గనూర్ విశాల విశ్వం, శ్రావణి, శిరీష, మురళీమోహన్ (అప్పి), కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, రాజునాయక్, మరియ బేగం, నాజియా బేగం, పెంటయ్య, స్వరర్ పాషా, మహ్మద్ ఇబ్రహీం, జ్రుమద్ ఖాన్, మంగ మధు, బీరప్ప, మంగ అశోక్, జగన్ గౌడ్, అగ్గనూర్ నందు, అగ్గనూర్ కిట్టు, వెంకటేష్, వెంకట్ సాయి, వెంకట్ రెడ్డి, షఫీ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్టు



**తలకొండపల్లి, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చంద్రదన గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై మహేశ్వరం ఎస్ఓటి పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించి పదిమందిని అరెస్టు చేశారు.ఎస్ఓటి, స్థానిక పోలీసుల వివరాల ప్రకారం తుమ్మలకుంట తండా, పెద్దూరు తండా, సాలార్‌పూర్, కందుకూరు మండలం నేదునూరు గ్రామాలకు చెందిన కొందరు చంద్రదన గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు.నిందితుల వద్ద నుండి రెండు కార్లు, ఎనిమిది సెల్‌ఫోన్లు, రూ.1 లక్ష నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించిన మనోహరాబాద్ యువకుడు



**మనోహరాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన నిమ్మల మల్లేష్ పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించారు. 2021లో విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నిర్వహించిన పరీక్షల ఫలితాలు కోర్టు స్టే కారణంగా ఆలస్యమయ్యాయి. ఇటీవల స్టే తొలగించడంతో ఎంపికైన అభ్యర్థులకు నేరుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ క్రమంలో నిమ్మల మల్లేష్‌కు మెదక్ జిల్లా శివంపేట్ మండలంలోని అల్లిపూర్ గ్రామానికి పంచాయతీ కార్యదర్శిగా నియామక పత్రం అందించారు. ఈ విజయంతో మనోహరాబాద్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో రోల్ మోడల్‌గా నిలవాలి

-ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి గ్రామస్తులంతా కృషి చేయాలి.
-కట్టకొమ్ము తండా గ్రామ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి.
-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ మార్చి 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండమండలంలోని కట్టకొమ్ము తండా గ్రామపంచాయతీ పరిధిలోని జాల్ తండాలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అన్ని శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే బాలు నాయక్ పర్యటించి,తండాలో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజల పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కట్టాకొమ్ము తండా రోల్ మోడల్ గా నిలవాలని పిలుపునిచ్చారు. తండా పరిసరాల పరిశుభ్రతతో పాటు తండా సమస్యల పరిష్కారానికి అధికారులు,గ్రామస్తులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించడం జరిగింది. దేవరకొండ పట్టణంలో పార్కు ఏర్పాటు చేయడం కోసం పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూములను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,అధికారులు, స్థానిక నాయకులు,ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దైవచింతన తో మానసిక ప్రశాంతత

-ఎమ్మెల్యే బాలు నాయక్.



**దేవరకొండ మార్చి 10. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
చింతపల్లిమండలంలోని తీదేడు గ్రామంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల వార్షిక (జాతర ) బ్రహ్మోత్సవాలలో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొని, స్వామి వారిని దర్శించుకొని వేద పండితుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామి వారి ఆశీస్సులు దేవరకొండ నియోజకవర్గ ప్రాంత ప్రజలపై ఉండి ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో, పాడిపంటలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన – ప్రగతి ప్రకణాళిక కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొన్నారు.

### గోనబోయినపల్లిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**దేవరకొండ మార్చి 10.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి గ్రామంలో మంగళవారం డిండి మండలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీనివాస్ యాదవ్,సర్పంచ్ వర్కాల బాల నారాయణ, ఉపసర్పంచ్ బద్దెల బాలలింగయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వార్డులలో మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు బ్లీచింగ్ పౌడర్ చల్లారు,రోడ్లను శుభ్రం చేశారు .ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ఉపేందర్, వార్డు సభ్యులు వరికుప్పల వసంత శ్రీశైలం,ఎలిజాల రామాంజనేయులు,మద్దెల దామోదర్,వరికుప్పల జ్యోతి రవి, తెలకపల్లి లలిత అంజి,కో ఆప్షన్ సభ్యుడు నడింపల్లి మల్లయ్య , గ్రామస్తులు పులిజాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


## సావిత్రిబాయి పూలే 129 వ వర్ధంతి



**దేవరకొండ మార్చి 10. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భారతదేశ మొట్టమొదటి చదువుల తల్లి మహిళా తొలి ఉపాధ్యాయురాలు, సావిత్రిబాయి పూలే 129 వ వర్ధంతి దేవరకొండ పట్టణంలో స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గ్రంథాలయంలో నిర్వహించారు . సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిరిజ నగర్ తండా గ్రామ పెద్దలు నేనావత్ లక్ష్మణ్ నాయక్ ఉపసర్పంచ్ శరావత్ బాలు నాయక్ హాజరైనారు వారికి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు ఎర్ర ఆంజనేయులు మాట్లాడుతూ భారత దేశంలో మహిళా విద్యకు మార్గదర్శి సావిత్రిబాయి పూలే మహిళా విద్యకు పునాదివేసి సమ సమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషిచేసిన మహనీయురాలని, సమాజంలో సమానత్వం కోసం జీవితాంతం పోరాడినారు మహిళల అభ్యుదయం కోసం శ్రమించి విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేసిన మహోన్నత మూర్తి స్త్రీల అభివృద్ధికి వారి హక్కుల కోసం కృషి చేసిన తొలితారం మహిళ ఉద్యమ కారులు, మహాత్మా జ్యోతిరావు పూలే గారి ప్రోత్సాహంతో బడుగు బలహీన ప్రజలకు దళిత గిరిజన మహిళలకు అగ్రవర్ణాల పేద మహిళలకు విద్యను అందించినట సంఘసంస్కర్త ఆ మహనీయురాలును మనం స్మరించుకుంటూ మహిళలంతా ఆమె బాటలో నడుస్తూ మరింత ముందుకు సాగాలని కోరారు. సావిత్రిబాయి పూలే ఆశయాల కోసం ప్రతి ఒక్కరు పాటుపడి అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నడవాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం చందంపేట మండల అధ్యక్షులు నాగిళ్ల వెంకటయ్య, బీఎస్పీ నల్గొండ జిల్లా ఈసీ మెంబర్ జుట్టు సతీష్ ,బహుజన తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ భవాని రామలింగేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి

-నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్



**దేవరకొండ మార్చి 10. (నీలగిరి ఎక్స్ ప్రెస్ ).**
ప్రతి ఒక్కరూ శ్రీశ్రీశ్రీ భవాని రామలింగేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు.మంగళవారం చింతపల్లి మండల పరిధిలోని తిదేడు గ్రామంలో శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ ప్రాంత ప్రజలు స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆనందంగా మెలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆయన అన్నారు.దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ ,కంకణాల వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ఉలుపాలస్వప్న శేఖర్ రెడ్డి,కోండల్ నాయక్, నిరంజన్ గౌడ్,శీమర్ల క్రిష్ణ యాదవ్,సీమర్ల శ్రీనివాస్ యాదవ్,మోతిరాం నాయక్, జైపాల్ నాయక్,గడ్డం శేఖర్,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులే రేపటి భారత భాగ్యవిధాతలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ



**మహబూబాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కేసముద్రం మండలం కల్వల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయ చైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజ్‌కృష్ణ మాట్లాడుతూ, “నేటి విద్యార్థులే రేపటి భారత భాగ్యవిధాతలు. చిన్నతనం నుంచే న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉంటే వారు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారు” అని పేర్కొన్నారు.సామాన్య ప్రజలకు న్యాయం చేకూర్చడంలో న్యాయస్థానాలు పోషించే పాత్రను వివరించిన ఆయన, నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయం అందించే ‘లీగల్ ఎయిడ్’ వ్యవస్థ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టం ముందు అందరూ సమానులేనని, రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా విస్మరించకూడదని సూచించారు.విద్యార్థులు దేశ చట్టాలను గౌరవించే అలవాటు చేసుకోవాలని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే ధైర్యం, బాధితులకు అండగా నిలిచే గుణాన్ని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.సదస్సులో విద్యార్థి దశలో సామాజిక మాధ్యమాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన లఘు చిత్రం ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**బల్మూర్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల పరిధిలోని జినుకుంట గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, “పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువుల ఆరోగ్యం కాపాడటమే రైతుల సంక్షేమానికి మూలం” అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు.నేటి నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు జిల్లాలోని 2 లక్షల 50 వేల పశువులకు టీకాలు వేసేలా పశుసంవర్ధక శాఖ అధికారులు 65 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారని, ప్రతి గ్రామంలో అవగాహన కల్పించి టీకాలు వేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రోడ్లు, డ్రైనేజ్ శుభ్రత పనులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరిశుభ్రతపై ఆరా తీశారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి పరిశుభ్రతకు పాటుపడాలని ఆయన కోరారు.కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జ్ఞానశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, గ్రామ సర్పంచ్ రంగినేని పుష్పలత, ఉపసర్పంచ్ కాలూరి తిరుపతమ్మ, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రైతుల ఉసురు – తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పేనా?




తెలంగాణ రాజకీయాల్లో రైతుల పాత్ర ఎప్పటికీ కీలకం. పంటలు పండించే రైతు చేతిలోనే నాయకుల భవిష్యత్తు కూడా ఉంటుంది. గతంలో ఎన్నో ప్రభుత్వాలు రైతుల ఆశలు నెరవేర్చడం వల్ల బలపడ్డాయి, మరికొన్ని రైతుల అసంతృప్తి వల్లే కూలిపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కూడా రైతుల మనసులో ఏం జరుగుతోంది అన్న ప్రశ్న మళ్లీ రాజకీయ వేదికపై చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం రాష్ట్రాన్ని నడిపిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై రైతుల్లో మిశ్రమ అభిప్రాయాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు---ప్రత్యేకంగా రుణమాఫీ, రైతు సంక్షేమ పథకాలు, మహిళలకు ఇచ్చిన గ్యారంటీలు---పూర్తిగా అమలు కాలేదని కొంతమంది విమర్శిస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరగడం లేదని కూడా కొన్ని వర్గాలు అంటున్నాయి. ఇదే సమయంలో గత ప్రభుత్వ కాలం కూడా రాజకీయ చర్చల్లో తరచూ ప్రస్తావనకు వస్తోంది. ముఖ్యంగా కే.చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలు---ప్రత్యేకించి రైతుబంధు---రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇచ్చాయని అనేక మంది గుర్తుచేస్తున్నారు. ఈ పథకం రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొంత బలం చేకూరిందని విశ్లేషకులు చెబుతున్నారు. రైతు సంక్షేమం గురించి మాట్లాడితే, గతంలో రైతు నాయకత్వానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాయకుల్లో వై . ఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా ఒకరు. ఆయన కాలంలో అమలు చేసిన ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు రైతు రాజకీయాల్లో ఒక మైలురాయిగా నిలిచాయని చాలామంది భావిస్తున్నారు. తెలంగాణలో కూడా రైతుల ఆశలు అలాంటి స్థాయిలో నెరవేరాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పుడు పెద్ద ప్రశ్న ఏమిటంటే---రాబోయే ఎన్నికల్లో రైతులు ఏ దిశగా వెళ్లబోతున్నారు? ప్రభుత్వానికి మద్దతు ఇస్తారా? లేక అసంతృప్తిని తిరుగుబాటుగా చూపిస్తారా?

సామాజిక పరిశీలకుల అభిప్రాయం ప్రకారం, రైతు అసంతృప్తి ఒక్కరోజులో బయటపడదు. అది గ్రామాల్లో నెమ్మదిగా పెరిగి చివరికి ఎన్నికల సమయంలో పెద్ద ప్రభావాన్ని చూపిస్తుంది. అదే సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తే ప్రజల్లో విశ్వాసం మళ్లీ పెరిగే అవకాశమూ ఉంటుంది.ఇంకొక ముఖ్యమైన అంశం రాజకీయ సంస్కృతి. ఎన్నికల సమయంలో నాయకులు ప్రజల ముందుకు వచ్చి వినమ్రంగా ఓట్లు అడుగుతారు. కానీ గెలిచిన తర్వాత ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అదే ఉత్సాహం కనిపించకపోతే అసంతృప్తి పెరుగుతుంది. ప్రజలతో నిరంతరం ఉండే నాయకత్వమే నిజమైన ప్రజాస్వామ్యానికి బలం.ప్రజాస్వామ్యంలో చివరికి నిర్ణయం తీసుకునేది ప్రజలే. కేవలం పార్టీలు, కులాలు, ప్రచారం ఆధారంగా కాకుండా నాయకుడి నిజాయితీ, సేవా చరిత్ర, ప్రజల పట్ల నిబద్ధత ఆధారంగా ఓటు వేయాలని సామాజికవేత్తలుసూచిస్తున్నారు.

రైతు బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుంది. రైతు సంతోషంగా ఉంటే ప్రభుత్వాలు బలపడతాయి. రైతు అసంతృప్తిగా ఉంటే రాజకీయాల్లో మార్పులు అనివార్యం అవుతాయి. అందుకే తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒక ప్రశ్న గట్టిగా వినిపిస్తోంది ---

"రైతుల ఉసురు అధికారాన్ని నిలబెడుతుందా... లేక రాజకీయాలను మార్చే గాలిగా మారుతుందా?"

**వ్యాసకర్త**

**గంగవరం రామకృష్ణారెడ్డి**
**(సీనియర్ జర్నలిస్ట్)**

## వెల్దండ పాఠశాలలో ఉచిత వైద్య పరీక్షలు



**వెల్దండ, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక సేవల కార్యక్రమంలో భాగంగా వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గుండాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు.పిల్లల్లో సాధారణ వ్యాధులు, పోషకాహార లోపాలపై అవగాహన కల్పిస్తూ, ఆరోగ్యకరమైన జీవన విధానంపై వైద్యులు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నిపుణులైన వైద్యులు, ఆర్బీఎస్కే బృందం పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.డాక్టర్ పాండురంగ (శిశువైద్య నిపుణులు), డాక్టర్ సింధు (పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్), డాక్టర్ రమణ కుమార్, డాక్టర్ కవిత, డాక్టర్ చంద్రసింగ్ (ఆయుర్వేద వైద్యులు) పర్యవేక్షణలో కార్యక్రమం విజయవంతమైంది.సూపర్వైజర్లు మురళీకృష్ణ, మనోజ్‌కుమార్, కవిత, ఫార్మసీ ఆఫీసర్ పుష్ప, ఏఎన్ఎంలు జహంగీర్‌బీ, లక్ష్మీకళ, ఆశా కార్యకర్త సుజాత పాల్గొన్నారు.

## మురికి కాలువ శుభ్రం చేసిన సర్పంచ్ మట్ట యాదమ్మ



**వెల్దండ, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వెల్దండ మండల కేంద్రంలో మంగళవారం ఐదవ రోజు పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని అంతర్గత రహదారులను శుభ్రం చేయడం, మురికికాలువలను శుభ్రపరచడం, తడి ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లడం, కాలువల చివర ఇంకుడు గుంతలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ప్రభుత్వం హాస్పిటల్‌ను సందర్శించి పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధు, ఉపసర్పంచ్ బసన్మోని శ్రీను, వార్డు సభ్యులు గోసులకొండయ్య, పాలది రంగనాథం, జంగలి ఆనంద్, రేవల్లి రాజు, మారేపల్లి శ్రీను, ముదికొండ రమేష్, మసిగుండ్ల వెంకటేష్, బాదేపల్లి రమేష్, శేఖర్, పురుషోత్తం చారి, రాఘవరెడ్డి, చీముల తిరుపతి రెడ్డి, కార్యదర్శి గిరిగౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తడి--పొడి చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం



**మహబూబాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా శీత్లాతండా గ్రామంలో మంగళవారం ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం జరిగింది. తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ క్షేత్ర పర్యటన ప్రోగ్రాంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు తడి, పొడి చెత్త వేరు చేయు విధానం, కంపోస్ట్ ఎరువు తయారీపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా టీఎన్జీసీ కోఆర్డినేటర్ సూర్యకిరణ్, ఎస్బీఎన్జీ కోఆర్డినేటర్ సిహెచ్. రవికుమార్, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ జూపూడి అనిల్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, తడి--పొడి చెత్త వేరు చేయడం దైనందిన జీవితంలో అలవాటు చేసుకోవాలని సూచించారు.గ్రామ సర్పంచ్ కళావతి కమ్లి బావ్‌సింగ్ హాజరై చెత్త వేరు చేయు విధానం, దాని ఉపయోగాలపై వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరి, ఏపీఓ రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ బండారి శ్రీనివాస్, నరేష్, అధ్యాపకులు, విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## గంజాయితో పట్టుబడిన నిందితులు




**మహబూబాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శనిపురం గ్రామ శివారులో బాలాజీ గార్డెన్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సబ్‌ఇన్స్పెక్టర్ వి. దీపిక తన సిబ్బందితో కలిసి అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరిని ఆపి తనిఖీ చేశారు.వారి వద్ద ప్రభుత్వం నిషేధించిన 1.68 కిలోల ఎండు గంజాయి, రూ.84,000 విలువ గల మత్తు పదార్థం బయటపడింది. నిందితులు షేక్ సోహెల్ అలియాస్ మహబూబ్ పాషా (25, డ్రైవర్, మిలిటరీ కాలనీ, మహబూబాబాద్) మరియు ఎడ్ల రామ్ చరణ్ (29, డ్రైవర్, కురవి గేటు, మహబూబాబాద్) అని పోలీసులు గుర్తించారు.వెంటనే పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, గంజాయి, బైక్‌తో పాటు నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణలో పాయలి క్రాంతికుమార్ అనే వ్యక్తి బైక్, గంజాయి ఇచ్చి ఎక్కువ రేటుకు అమ్మాలని చెప్పినట్లు తెలిసింది.ఈ ఘటనపై రూరల్ సీఐ సర్వయ్య, ఎస్ఐ దీపిక, పోలీస్‌స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అభినందించారు.

## పాలకుర్తిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**పాలకుర్తి, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పాలకుర్తి మండలం జయ్యారం, గుడిపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ సతీమణి, మక్కన్ సింగ్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలి ఠాకూర్ మంగళవారం శంకుస్థాపన చేశారు.జయ్యారం గ్రామంలో సీసీ రోడ్డు పనులకు, గుడిపల్లి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పోచమ్మ గుడి పునర్నిర్మాణ పనులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు.ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో పల్లెల అభివృద్ధికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పనులు వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గ్రామస్థులు మనాలి ఠాకూర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు కాసర్ల కిరణ్, కాసర్ల శ్రీసుధ, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపల్లి తిరుపతి, మాజీ ఎంపీపీ గంగాధర రమేష్, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

-- ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్



**పాలకుర్తి, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా పాలకుర్తి మండలం బసంతనగర్ గ్రామంలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు.రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ యువత డ్రగ్స్, మద్యం, గుట్కాలకు అలవాటు పడితే చదువులు, పనుల్లో ఏకాగ్రత కోల్పోయి భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారి మీ బంగారు భవిష్యత్తును చెడగొట్టుకోవద్దు అని యువతను కోరారు.మాదకద్రవ్యాలు వాడుతున్నవారు లేదా విక్రయిస్తున్నవారి గురించి సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్శవేణి శ్రీనివాస్, ఉప సర్పంచ్ మౌనిక శ్రీనివాస్, వార్డు సభ్యులు మారం మల్లేశం, ముస్తాక్ అహ్మద్, గడ్డం రాజమౌళి, కన్నం అంజులు, కన్నం సంపత్, గ్రామ పంచాయతీ సిబ్బంది, యువకులు, ఎక్సైజ్ సిబ్బంది ప్రసాద్, రఘు, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రియాశీలక సభ్యత్వము ఒక భరోసా

-జనసేన పార్టీ ముఖ్య నాయకులు కోర్ర చందు నాయక్.



**దేవరకొండ మార్చి 10. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ పట్టణం కోర్రతండ గ్రామపంచాయతీలో మంగళవారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం స్టాల్ ఏర్పాటుచేసి మారుమూల తండాలో ఉన్న ప్రజలకు సభ్యత్వం గురించి వివరించడం వలన పవన్ కళ్యాణ్ పై ఉన్న అభిమానంతో సభ్యతము ప్రతి ఒక్కరు తీసుకోవడం జరిగింది. ఈ సభ్యతము 400 రూపాయలతో సభ్యత్వం తీసుకొని ఏదైనా ప్రమాదంలో దెబ్బలు తగిలితే 50వేలు పైన కాలు చేతులు కోల్పోయిన వారికి రెండు లక్షలు సహజ మరణం లక్ష రూపాయలు ప్రమాదంతో మరణిస్తే 5 లక్షల రూపాయలు జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ఒక భరోసా నివ్వడం గొప్ప విషయం ప్రతి ఒక్క కార్యకర్తకు కాపాడుకోవడం వారికి భరోసా ఇవ్వడం మంచి ఆలోచన పవన్ కళ్యాణ్ గారిది అని ప్రజలు పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలియజేశారు .క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమంలో కోర్రతండ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో పారిశుద్ధ్య కార్యక్రమం




**ఉప్పునుంతల, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం తిరుమలాపురం గ్రామంలో 99 యాక్షన్ ప్లాన్ భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు జరుగుతున్న ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయడం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బరిగేలా శ్రీకాంత్, ఉప సర్పంచ్ రేణయ, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా విద్యకు మార్గదర్శకురాలు సావిత్రిబాయి పూలే



**పెద్దపల్లి, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహిళా విద్యకు మార్గదర్శకురాలిగా, సమాజ సంస్కర్తగా చిరస్థాయిగా నిలిచిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్ అన్నారు. సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా ఆమె ఫోటోకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చదువుకుంటేనే సమాజాభివృద్ధి సాధ్యమని, సావిత్రిబాయి మహిళా విద్యకు తొలి దీపం వెలిగించిన మహానీయురాలని పేర్కొన్నారు. దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆమె విశేష కృషి చేశారని, కుల వివక్ష, బాల్య వివాహాలు, మహిళలపై అన్యాయాలపై ఆమె పోరాడారని గుర్తు చేశారు. పుణెలో తొలి బాలికల పాఠశాలను నెలకొల్పిన మహానీయురాలని కొనియాడారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోమటిపల్లి రాజేందర్, సదానందం, కొండి దిలీప్, ధనుంజయ్, ఆడిపు సుధాకర్, మిట్టపల్లి శ్రీనివాస్, మాదాసు కృష్ణ శ్రీధర్, అభిలాష్, తరుణ్, రూపేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--పట్టణ ప్రణాళికలో బస్ స్టాండ్ పరిశుభ్రతకు పిలుపు



**హుస్నాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
99 రోజుల ప్రజా పాలన--పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ బస్ స్టాండ్‌లో చెత్త తొలగింపు, బాత్రూముల శుభ్రత పనులు నిర్వహించారు. డిపో మేనేజర్ వెంకన్న నాయక్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో బస్ స్టేషన్ మేనేజర్ లకవత్ హరినాయక్ మాట్లాడుతూ ప్రయాణికులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు బస్ స్టాండ్ పరిశుభ్రతను కాపాడాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకూడదని, చెత్త కోసం డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మన ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుతామో, అలాగే మన బస్ స్టాండ్‌ను కూడా పరిశుభ్రంగా ఉంచుదాం అని ఆయన పిలుపునిచ్చారు. గార్డెన్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# కవిత అరెస్ట్‌పై తీవ్రంగా ఖండిస్తున్న జాగృతి

**కరీంనగర్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖమ్మం జిల్లాలో వెలుగుమట్ల భూ నిర్వాసితుల పక్షాన అంబేద్కర్ భవన్‌లో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మహిళా పోలీసుల లేకుండా అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడం ప్రజాస్వామ్యానికి అవమానకరమని జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ముగ్గురు మంత్రులు ఉన్న ఖమ్మం జిల్లాలో నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా, కవిత దీక్షను అడ్డుకోవడం ప్రజల గొంతును అణచివేయడమేనని ఆయన అన్నారు. ఇలాంటి



అరెస్టులు, అక్రమ కేసులు పెట్టినా కవితక్క కానీ జాగృతి నాయకులు కానీ వెనుకడరు అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను అణచివేసిన విధంగానే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బుల్డోజర్లపై ఆధారపడి పాలన చేస్తోందని విమర్శించారు. పేదల భూములను ప్రభుత్వ పెద్దలు బినామీల పేరుతో కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. వెలుగుమట్ల బాధితులకు స్వంత ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేకపోతే ప్రజలే తిరుగుబాటు చేసే రోజులు వస్తాయని హెచ్చరించారు. ప్రస్తుతం కవితక్క హైదరాబాద్‌లో తన దీక్షను కొనసాగిస్తుండగా, యావత్ తెలంగాణ ప్రజలు మద్దతు తెలుపుతున్నారని గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు.

# ఐకేపీ సెంటర్ కోసం ప్రభుత్వ భూమి కేటాయించాలని రైతుల వినతి

**గంగాధర, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని చెర్లపల్లి (ఆర్) గ్రామంలో రైతుల సౌకర్యార్థం ఐకేపీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామ సర్పంచ్ ఎట్టెపు కనుకయ్య ఆధ్వర్యంలో రైతులు ఎమ్మార్వో అంబటి రజితకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి సంబంధించిన నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని ధాన్యం కొనుగోలు సెంటర్ కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ధాన్యం ఆరబెట్టేందుకు అద్దె స్థలాన్ని తీసుకోవాల్సి వస్తోందని, ప్రతిసారి అద్దె స్థలంలోనే కొనుగోలు సెంటర్ నడుస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రైతుల సమస్యలను విన్న ఎమ్మార్వో రజిత సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నేరేళ్ల అయిలయ్య, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# 6వ డివిజన్ నూతన కార్పొరేటర్‌కు ఘన సన్మానం




**కరీంనగర్ ,మార్చి 10(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బొమ్మకల్ 6వ డివిజన్ కార్పొరేటర్‌గా నూతనంగా ఎన్నికైన మేకల వెంకటేష్‌ను అంజనా నగర్ శ్రీ బాలాజీ రైతు మిత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు మిత్ర సంఘం కమిటీ అధ్యక్షుడు జవాజి మల్లయ్య, కనకయ్య, బాగోతం బీరయ్య, అసిరి తిరుపతి, పరశురాములు, రాయుడు రమేష్, పెద్ది శంకర్, ఆంజనేయులు, బీరయ్య, హరీష్ రాజు, మల్లేశం, రఘు తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా మిలియన్ మార్చ్ దినోత్సవం

-- అమరవీరులను స్మరించిన ఉద్యమకారులు

**అబ్రాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



హైదరాబాద్ గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు అమరులను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ప్రొఫెసర్ కోదండరాం, న్యూ డెమోక్రసీ గోవర్ధన్, సంధ్య, విమలక్క తదితర ఉద్యమ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరవీరులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరవలేమని పేర్కొన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధి దిశగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. మార్చి 16న జరగనున్న అసెంబ్లీ వేసవి సమావేశాల్లో ప్రభుత్వం ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన వారి సేవలను గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు శ్రీనివాస్‌తో పాటు ఉద్యమ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం పరిశీలన

- కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వివిప్యాట్ గోదాంలను తనిఖీ చేసి సమగ్ర నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. గోదాంలో భద్రతా ఏర్పాట్లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది హాజరు తీరుపై కూడా ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మి కిరణ్, ఆర్డీవో కె. మహేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ పార్టీ ప్రతినిధి దేవిశెట్టి నవీన్ కుమార్, టిడిపి పార్టీ ప్రతినిధి ఎర్రవెల్లి రవీందర్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి

-- కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, మార్చి 10(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఉందని, గ్రామీణ స్థాయిలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి ఆరోగ్య సేవలు సమర్థంగా చేరేలా కార్యాచరణ రూపొందించాలని, తల్లి--శిశు ఆరోగ్యం, టీకా కార్యక్రమాలు, వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాలను మెరుగుపరచాలని ఆమె ఆదేశించారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి సనా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిత, వీవో ఎన్‌సీడీ ఉమశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రాజగోపాల్, చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు కూల్చివేతపై తీవ్రంగా ఖండించిన సిపిఐ

**కరీంనగర్, మార్చి 10(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 58వ డివిజన్ బోయవాడకు చెందిన నిరుపేద లైన్ మంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు ప్రహరీ గోడను మునిసిపల్ అధికారులు ప్రజా ప్రతినిధుల అండదండలతో కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు న్యాలపట్ల రాజు తీవ్రంగా ఖండించారు. మంగళవారం సిపిఐ నాయకులు కూల్చివేత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాలపట్ల రాజు మాట్లాడుతూ పేదవాడికి ఇల్లు నిర్మించుకునే హక్కు కూడా భరించలేని స్థితిలో ప్రజా ప్రతినిధులు వ్యవహరించడం సిగ్గుచేటు అని అన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా డిఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి గోడను కూల్చివేయడం అధికారుల అవినీతికి నిదర్శనమని విమర్శించారు. ఈ ఘటన వెనుక బీజేపీ నేతల హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తూ, గతంలో బిఆర్ఎస్ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడినప్పుడు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. పేదలపై దౌర్జన్యం చేస్తే సిపిఐ ఊరుకోదని హెచ్చరించారు. ఒక బడా వ్యాపారవేత్త



కోసం కార్పొరేటర్ ఒత్తిడి చేయడంతో కుటుంబం స్థలాన్ని అమ్మకుండా ఇల్లు నిర్మించుకోవడం వల్లే గోడను కూల్చివేయడం నీచమైన చర్య అని అన్నారు. బాధితురాలికి వెంటనే కూల్చిన గోడను తిరిగి నిర్మించాలని, లేని పక్షంలో పేదల పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బాధితురాలు లైన్ మంగా, లైన్ మల్లేశ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# స్క్రీన్ టైమ్ టు ఎగ్జామ్ టైమ్ పేరుతో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక సదస్సు

**హుస్నాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్క్రీన్ టైమ్ టు ఎగ్జామ్ టైమ్ పేరుతో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పరీక్షల ఒత్తిడికి గురి కాకుండా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు 500 మందికి ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏబీవీపీ ప్రాంత సంఘటన మంత్రి విష్ణువర్ధన్, జనగామ మురళీధర్ రావు, ముఖ్య వక్తగా ఉమాపతి, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు, జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏబీవీపీ 1949లో ప్రారంభమైనప్పటి నుండి విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక స్పృహ, సేవా భావాలను పెంపొందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులు పరీక్షలను ఒత్తిడిగా కాకుండా ఒక పుస్తకంలోని పేజీలా భావించి ప్రశాంతంగా సిద్ధమై అత్యుత్తమ ఫలితాలు



సాధించాలని సూచించారు. మీ తల్లిదండ్రులకు, పాఠశాలలకు, ప్రాంతానికి మంచి పేరు తెచ్చేలా కృషి చేయండి. మీ వెంట ఎల్లప్పుడూ ఏబీవీపీ ఉంటుంది అంటూ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ విభాగ్ సంఘటన మంత్రి లక్ష్మణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాహుల్, నగర కార్యదర్శి చరణ్, ఉపాధ్యక్షులు రాజు అంజి, మహిళా కన్వీనర్ శిరీష, అశ్విని, పూర్వ ఏబీవీపీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన పట్టణ ప్రణాళికలో భాగంగా శుభ్రత కార్యక్రమం



**హుస్నాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రజా పాలన పట్టణ ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలో చెత్త తొలగింపు, స్టోన్ వాటర్ డ్రైన్ల శుభ్రపరిచే పనులు చేపట్టారు. పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో 14వ, 16వ వార్డుల్లో ఈ కార్యక్రమం జరిగింది. చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పట్టణ పరిశుభ్రతను కాపాడాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకూడదని, పట్టణాన్ని స్వచ్ఛ హుస్నాబాద్గా మార్చేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. జెసిబి సహాయంతో స్టోన్ వాటర్ డ్రైన్లను శుభ్రపరిచి స్క్రీనింగ్ బార్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, మెప్మా రిసోర్స్ పర్సన్స్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్



**పాలకుర్తి, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఈ ప్రణాళిక ద్వారా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న గొప్ప కార్యక్రమమని అన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకోవాలని సూచించారు. తాను ఎమ్మెల్యే పదవి చేపట్టిన రెండేళ్లలోపే పాలకుర్తి మండలానికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశానని తెలిపారు. త్వరలోనే పాలకుర్తి నుండి ఈశాల తక్కల్లపల్లి గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఆజిమల్లు, ఉప సర్పంచ్ ఐద బుగ్గరామస్వామి, వార్డు సభ్యులు, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపల్లి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# హామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి పంపిణీ





**కరీంనగర్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రభుత్వ గంజ్ హై స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. సంస్థ సభ్యుడు నక్క రాఘవేందర్ కుమార్తె నక్క జ్ఞానతిక జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారని సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని, పరీక్షలను పండుగలాగా భావించాలని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు. ఇతరులతో పోల్చుకోకుండా, ఒత్తిడిని జయిస్తే విజయాన్ని సాధించవచ్చు అని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకొని సమాధానం రాయాలని సూచించారు. రాబోయే వార్షిక పరీక్షల్లో 555 పైగా మార్కులు సాధించే విద్యార్థులకు సంస్థ తరఫున రూ. 2016 నగదు పారితోషికం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, సంస్థ కార్యదర్శి తొడుపునూరి తిరుపతి, సభ్యులు నక్క రాఘవేందర్, ముని గోపాల్, మణికంట, టి. శ్రీరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి

- కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఆర్డిఓ, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన పంచాయతీ, అంగన్వాడి, పాఠశాల, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణంలో వేగం పెంచాలని సూచించారు. ఇంకా ప్రారంభం కాని పనులపై ఎంపీడీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, స్థల కొరత ఉన్న గ్రామాల్లో వెంటనే అనువైన స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. మండల స్థాయిలో సర్పంచ్, కార్యదర్శి, ఏఈ, డిఈ, ఎంపీడీవోలు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. స్లాబ్, రూఫ్ లెవెల్‌కు చేరుకున్న భవనాలను వేగవంతం చేసి ప్రజా పాలన కార్యక్రమంలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిఆర్డిఓ శ్రీధర్, పంచాయతీరాజ్ ఈఈ రహమాన్, ఎంపీడీవోలు, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# పోచమ్మ ఆలయం వద్ద బోర్‌వెల్ ఏర్పాటు

**ఎలిగేడు, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని రాములపల్లి పోచమ్మ ఆలయం వద్ద నీటి సౌకర్యం లేక గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో




సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. గ్రామస్థుల సమస్యను సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన ఎస్ఎఫ్ నిధుల ద్వారా బోర్‌వెల్ ఏర్పాటు చేయడానికి కృషి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కుల సంఘాల పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి







**కరీంనగర్/హుస్నాబాద్/కోహెడ/ఉల్లంపల్లి/ మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్, హుస్నాబాద్, కోహెడ మండలాల్లో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ విజయ్ కుమార్, ఓయూ జేఏసీ వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని, మహిళా విద్యా విస్తరణకు సావిత్రిబాయి చేసిన అపూర్వ సేవలను గుర్తుచేశారు.పూలే బీసీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కదారి అయిలన్న కురుమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించి, 20 పాఠశాలలు స్థాపించడం ద్వారా మహిళా విద్యకు పునాది వేశారని తెలిపారు. ఆమె కవితలు, రచనలు అణగారిన వర్గాలకు ప్రేరణనిచ్చాయని, సమానత్వ సమాజం కోసం ఆమె పోరాటం చిరస్మరణీయమని అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రధాన కార్యదర్శి వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆమె బాల్య వివాహాల నిర్మూలన, అంటరానితన నిర్మూలన, మహిళా సాధికారత కోసం చేసిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, మహిళలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సావిత్రిబాయి పూలే సేవలను స్మరించారు.


# ఓదేల ప్రాంతానికి ఆర్ఓబీ మంజూరుకై కృషి చేస్తాం

**- ఎంపీ వంశీ కృష్ణ**



**పెద్దపల్లి, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొలనూరు ప్రాంతానికి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మంజూరు కావడం ప్రజలకు ఎంతో ఆనందకరమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ తెలిపారు. రైల్వే గేటు కారణంగా కొలనూరు, ఓదేల ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. రైల్వే అధికారులు కొలనూరు ప్రాంతాన్ని సందర్శించినప్పుడు తాను స్వయంగా వారితో కలిసి పరిశీలన నిర్వహించానని, ఆ సమయంలో ఓదేల ప్రాంతానికి కూడా ఆర్ఓబీ అత్యవసరమని వివరించానని తెలిపారు.మొదట రైల్వే శాఖ కొలనూరుకు మాత్రమే ఆర్ఓబీ మంజూరు చేసి, ఓదేల ప్రాంతానికి సాధ్యం కాదని తెలిపిందని, అయినప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేశానని ఎంపీ వంశీ కృష్ణ అన్నారు. పలుమార్లు లేఖలు రాసి, రిప్రెజెంటేషన్లు ఇచ్చిన ఫలితంగా రైల్వే శాఖ స్వంత ఖర్చుతో కొలనూరులో ఆర్ఓబీ నిర్మాణానికి అంగీకరించిందని తెలిపారు. ఓదేల ప్రాంతానికి కూడా ఆర్ఓబీ మంజూరు అయ్యేలా కృషి కొనసాగిస్తామని, రెండు ప్రాంతాల్లో ప్రజల సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావడానికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.కొలనూరు గ్రామ ప్రజలకు ఆర్ఓబీ మంజూరు కావడం పట్ల అభినందనలు తెలియజేస్తూ, త్వరలోనే పనులు ప్రారంభమై పూర్తి అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతమైన లాప్రోస్కోపిక్ సర్జరీలు



**పెద్దపల్లి, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు.బొంపల్లి కి చెందిన 30 ఏళ్ల మహిళకు గాల్ బ్లాడర్ నెక్‌లో స్టోన్ ఉండగా, మంచిర్యాలకి చెందిన 40 ఏళ్ల వ్యక్తికి గాల్ బ్లాడర్ నెక్‌లో స్టోన్‌తో పాటు ఇన్ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించారు. ఇన్ఫెక్షన్ తగ్గిన తర్వాత ఇద్దరికీ లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ ఆపరేషన్ విజయవంతంగా చేశారు.అదేవిధంగా పెద్దపల్లి కి చెందిన 33 ఏళ్ల మహిళకు గర్భాశయం రెండు భాగాలుగా ఉండడం, ఒక భాగంలో ఎండోమెట్రియోసిస్ వ్యాధి ఉండడం గుర్తించి చెడిపోయిన భాగాన్ని తొలగించారు.ఈ సర్జరీల్లో లాప్రోస్కోప్ సర్జన్ డాక్టర్ అమర సింహ రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ స్వాతి, డాక్టర్ రామమం, డాక్టర్ భవాని పాల్గొన్నారు. వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రిలోనవజాత శిశు కేంద్రం సేవలు,టూడి ఎకో, లాప్రోస్కోపిక్ సర్జరీలు, యూరాలజీ, రూట్ కెనాల్ సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని వినియోగించుకోవాలని సూచించారు.అలాగే ఆసుపత్రిలో అన్ని సేవలు ఉచితమని, ఎవరూ లంచం ఇవ్వకూడదని, సానిటేషన్ లేదా ఇతర సమస్యలపై నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా నేరుగా సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని, లేకపోతే కంప్లైంట్ బాక్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

# జూలపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం



**పెద్దపల్లి, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూలపల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రేగటి సత్యనారాయణ--స్వప్న దంపతులు తమ కుమార్తె ప్రణవి, కుమారుడు ఇషాన్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువీర్ సింగ్ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రార్థించారు. ఆలయ కమిటీ చైర్మన్ పొట్టాల మల్లేశం సత్యనారాయణ, రవీందర్‌లను శాలువాతో సన్మానించారు. అనంతరం రఘువీర్ సింగ్ కూడా ఆలయ కమిటీ సభ్యులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పొట్టాల మల్లేశం, వైస్ ప్రెసిడెంట్ దేవసాని శంకరయ్య, లెక్కల వజ్రారెడ్డి, సభ్యులు పాటకుల అనిల్, వంగపల్లి వెంకటరమణ, బండి రాజిరెడ్డి, మద్దపెల్లి శ్రీనివాస్, నోముల గోపాల్ రెడ్డి, అందె ప్రసాద్, బెజ్జంకి రమేశ్, ఠాకూర్ సత్యనారాయణ, కొమ్మ సతీష్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రైతులకు యాంత్రికరణ పనిముట్ల పంపిణీ

**-- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు**



**పెద్దపల్లి, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం, ప్రజాప్రభుత్వంలోనే రైతులకు మేలు జరుగుతుంది అని అన్నారు.పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వ్యవసాయ యాంత్రికరణ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా 63 మంది రైతులకు మొత్తం 103 యూనిట్లకు గాను రూ.1 కోటి 11 లక్షల విలువైన రోటోవేటర్లు, గడ్డి కట్టలు కట్టే యంత్రాలను సబ్సిడీతో పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిలిపివేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనార్థం మళ్లీ ప్రారంభించిందని తెలిపారు. రైతులు నానో యూరియా, నానో డిఏపీ, నానో పొటాష్ వాడాలని సూచించారు.అలాగే కేజీ వీల్స్ ట్రాక్టర్ల వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, వీటికి పట్టీలు పెట్టుకోవాలని సూచించారు. రోడ్లపై కేజీ వీల్స్‌తో నడిపితే మొదటిసారి రూ.5 వేల జరిమానా, రెండోసారి రూ.10 వేల జరిమానా, మూడోసారి కేసు నమోదు చేసి బండిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, డిఏవో శ్రీనివాస్, ఏడిఏ శ్రీనాథ్, మార్కెట్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఇంటర్ తర్వాత కోర్సులపై అవగాహనకై పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలో మార్చి 15వ తేదీ ఆదివారం మెగా ఎడ్యుకేషన్ ఫేర్ ఘనంగా నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమం టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో జరగనుంది.ఈ సందర్భంగా తెలంగాణ విద్యా సమితి చైర్మన్ తారక్ గౌడ్, టీమ్ సభ్యులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఉన్నత విద్యపై సరైన అవగాహన కల్పించేందుకు ఇలాంటి ఎడ్యుకేషన్ ఫేర్‌లు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ తర్వాత అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, కెరీర్ అవకాశాలపై ఒకే వేదికపై సమగ్ర సమాచారం అందించేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని పేర్కొన్నారు.విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఎడ్యుకేషన్ ఫేర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యా సమితి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు ప్రవీణ్ రాజ్, గణేష్, రాజేష్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ జనరల్ బాడీ ఎన్నిక



**తిప్పర్తి ,మార్చి 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం తిప్పర్తి మండలం మల్లె పల్లి వారి గూడెం బ్రిటానియా బాప్టిస్ట్ చర్చిలో మంగళవారం జరిగింది. ఈ జనరల్ బాడీ లో ఎలక్షన్స్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ అడ్వైజర్ గా దాసరి ప్రీతి ప్రశాంత్ కుమార్, అధ్యక్షులుగా రెవరెండ్ డాక్టర్ కత్తి డేవిడ్ రాజు, గౌరవ అధ్యక్షులుగా రెవరెండ్ డాక్టర్ ఎం యేసయ్య, జనరల్ సెక్రెటరీగా రెవరెండ్ ఎస్.కె జాన్ బాబు, ఉపాధ్యక్షులుగా రెవరెండ్ ఎన్. గిడియూన్, పి సైమన్, డాక్టర్ పి రాజ్ కుమార్, ట్రెజరర్ గా సిహెచ్ ఏసుదాసు, అసిస్టెంట్ ట్రెజరర్ గా సిహెచ్ జాన్, జాయింట్ సెక్రటరీగా ఆర్ తి మొతి, సెక్రటరీగా వై యేసు రత్నం, అసిస్టెంట్ సెక్రటరీగా పాస్టర్ సామ్యూల్, ఉమెన్స్ కమిటీ అధ్యక్షురాలుగా కె సలోమియా, జనరల్ సెక్రెటరీ జోష్నా పాల్రాజు, చీఫ్ అడ్వైజర్ గా ప్రీతి ప్రశాంత్, ట్రెజరర్ గా కె దేబోరా, ఉపాధ్యక్షులుగా సీమన్, జాయింట్ సెక్రటరీగా కృపాజ్యోతి ఎన్నికయ్యారు. రాబోయే నాలుగు సంవత్సరాలు వరకు ఈ కార్యవర్గం ఉంటుందని తెలిపారు. సుమారు 60 మంది పాస్టర్లు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కనగల్ మండల నూతన సర్పంచులు



**కనగల్, మార్చి 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ జిల్లా కనగల్ మండలానికి చెందిన సర్పంచులు మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ద్వారా ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలతో నేరుగా మమేకమై పనిచేసినప్పుడే వారి అసలు అవసరాలు, సమస్యలు స్పష్టంగా తెలుస్తాయని తెలిపారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి వెంకట్ రెడ్డి గారు దిశానిర్దేశం చేశారు. ప్రజాసేవలో జవాబుదారీతనం ప్రతి ప్రజాప్రతినిధిలో ఉండాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనగల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం మనోహర్ రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## మహిళల విద్యాబోధనకు కృషి చేసిన యోధురాలు సావిత్రిబాయి పూలే



**మహబూబాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయులు పార్నంది రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అలంబ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, "సావిత్రిబాయి పూలే గొప్ప మేధావి. బడుగు, బలహీనుల జీవిత ఉన్నతి కోసం, ముఖ్యంగా మహిళల విద్యాబోధన కోసం ఆమె చేసిన కృషి అపారమైనది" అని కొనియాడారు. ఆనాటి సమాజంలో ఎదురైన ప్రతిబంధకాలను ఎదుర్కొంటూ, తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి సామాజిక న్యాయం కోసం పోరాటం సాగించారని వివరించారు. మహిళలు, పేదల చదువుల కోసం విద్యాసంస్థలు స్థాపించి వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దిన సావిత్రిబాయి పూలే భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారని, ఆమె మార్గదర్శనం నేటి సమాజానికి కూడా ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై. కృష్ణప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ శంకర్, పారామెడికల్ ఇన్‌చార్జ్ కృష్ణారావు, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## గౌడ కౌన్సిలర్లను ఘనంగా సన్మానించిన గోపా జిల్లా కమిటీ





**మహబూబాబాద్, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహబూబాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయం సాధించిన గౌడ కులానికి చెందిన కౌన్సిలర్లు ముత్యం వెంకన్నగౌడ్, గాడిపల్లి నాగేశ్వరరావు, గాడిపల్లి లావణ్యచరణ్ గౌడ్, ధూపటి స్పందన వినయ్ గౌడ్‌లను గోపా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు బిక్కి వెంకటేశ్వర్లు గౌడ్, ప్రచార కార్యదర్శి చిత్తనూరి శ్రీనివాస్ గౌడ్, లీగల్ అడ్వైజర్ సుభాష్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి బుర్ర గోవర్ధన్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్క నాగార్జున గౌడ్, ట్రెజరర్ గడ్డం యాదగిరి గౌడ్, గడ్డం విజయ్, కార్యవర్గ సభ్యులు ఉమ్మగాని శ్రీనివాస్, తొర్రూర్ సహకార పరపతి సంఘం కార్యదర్శి కుంభం మహేష్ కుమార్ గౌడ్, తొర్రూర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు కుర్ర నరేష్ గౌడ్, పొలగాని అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



**ఎలిగేడు, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నెలరోజులపాటు మండల పరిధిలోని 12 గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు ఎలిగేడు వెటర్నరీ డాక్టర్ ఝాన్సీ తెలిపారు. మంగళవారం శివపల్లె గ్రామంలో 252 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆమె పేర్కొన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుగ్యాల వాణి, వెటర్నరీ సిబ్బంది శంకర్, గోపాలమిత్ర సమ్మయ్య, ఫక్రోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక లక్ష్యంగా ముందడుగు




రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2ను పురస్కరించుకుని ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక' పేరుతో బృహత్తర కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ప్రజా సంక్షేమాన్ని కేంద్రీకరించుకుని అన్ని ప్రభుత్వ రంగాలను సమన్వయం చేస్తూ సమగ్ర ప్రణాళికను రూపొందించడం విశేషం. ఈ క్రమంలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు మొత్తం 99 రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. ఈ కార్యక్రమాలను ఐదు దశల్లో అమలు చేస్తూ, పది ప్రధాన థీమ్‌ల ఆధారంగా ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించడమే లక్ష్యంగా నిర్ణయించింది. మొదటి దశలో భాగంగా ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయనున్నారు. రెండో దశలో ఏప్రిల్ 16న మండల స్థాయిలో అధికారిక కార్యక్రమాలు నిర్వహించి వివిధ ప్రభుత్వ పథకాల పనితీరును విశ్లేషించనున్నారు. మూడో దశలో మే 2న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగో దశలో మే 22న జిల్లా కలెక్టర్ స్థాయి నుంచి గ్రామ స్థాయి అధికారుల వరకు సమన్వయం సాధిస్తూ కార్యాచరణ కొనసాగించనున్నారు. ఈ 99 రోజుల కార్యాచరణలో ప్రభుత్వం పలు ముఖ్యాంశాలను ప్రాధాన్యంగా తీసుకుంది. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రతను మెరుగుపరచడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ఆరోగ్య మరియు వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించడం, "అరైవ్ అలైవ్" నినాదంతో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం కూడా ఈ కార్యక్రమంలో భాగం. అదేవిధంగా సంక్షేమ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, పిల్లల భవిష్యత్తు కోసం విద్యా మరియు ఆరోగ్య రంగాల్లో చర్యలు చేపట్టడం, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం వంటి అంశాలు కూడా ప్రాధాన్యంగా నిలుస్తున్నాయి. వ్యవసాయ రంగంపై దృష్టి సారించి రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకోవడం, విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంపొందించడం, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి క్రీడాకారులుగా తీర్చిదిద్దడం, మహిళా సాధికారతకు ప్రోత్సాహం ఇవ్వడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం వంటి పలు రంగాల్లో కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇవి మాత్రమే కాకుండా ప్రతి జిల్లా కలెక్టర్ ప్రజా సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించేలా నెలలో కనీసం పది రోజులపాటు క్షేత్రస్థాయిలో ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. ప్రతి పాఠశాలలో ఒక అధికారి మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించేందుకు నియమించనున్నారు. వారంలో ఒకసారి జిల్లా కలెక్టర్ స్వయంగా ఒక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించనున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి రాష్ట్రంలోని 100 నియోజకవర్గాలలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే జూన్ 12న అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 21 రకాల విద్యా కిట్లను అందించనున్నారు. ఇలాంటి ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక ప్రజలకు ఆశాజనకమైన చర్యగా కనిపిస్తున్నప్పటికీ, కొన్ని అంశాలపై ప్రభుత్వం మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న జాప్యాలను నివారించడం, ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రత్యేక దృష్టి సారించడం అవసరం. అన్ని సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతూ "ప్రజా పాలన -- ప్రజలే ప్రభువులు" అనే నినాదాన్ని సార్థకం చేయడం ప్రభుత్వ బాధ్యత. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ మరింత అభివృద్ధి కాంతులతో వెలుగొందాలని, "నా తెలంగాణ రత్నాల వీణ"గా దేశంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాలని ప్రజల ఆశ.

-- గోరుపాటి శంకర్
(రచయిత, జర్నలిస్టు)
ఎం.ఏ తెలుగు -- ఉస్మానియా యూనివర్సిటీ
ఎం.సి.జె. (జర్నలిజం)



# ఆరోగ్య సంరక్షణకే 5కే రన్

### -- మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్



**ఆమనగల్లు, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజల్లో ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంపొందించేందుకు 5కే రన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ ప్రారంభించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం ఆమనగల్లు పురపాలక సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహం నుండి సేవాలాల్ ఘాట్, సాయిబాబా ఆలయం వరకు రన్ నిర్వహించారు. వైస్ చైర్‌పర్సన్ తల్లోజు గీత ఆచారి, సీఐ జానకిరామ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎంఈఓ పాండు, మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, శానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్, కౌన్సిలర్లు పాల్గొనగా, చైర్మన్ జెండా ఊపి రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ పత్యనాయక్ మాట్లాడుతూ, "ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో ప్రతిరోజూ కార్యక్రమాలు నిర్వహించాలి. ఆరోగ్య పరిరక్షణతో పాటు అవగాహన కల్పించేందుకు ఈ హెల్త్ రన్ నిర్వహించాం" అని తెలిపారు. సీఐ జానకిరామ్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణకు 5కే రన్ ఎంతో ఉపయోగకరమని, ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ, "ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు. ఆరోగ్యంగా ఉంటేనే విజయాలు సాధించగలము" అని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, యువత, ప్రజలు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, నిరంజన్, ఎనుమల్ల రమేష్, ఎర్రవోలు మహేష్, సునీత ప్రశాంత్, నాగిళ్ల జగన్, పుల్లారెడ్డి అనూష శ్రీశైలం, మొక్తల వెంకటయ్య, ఎంగలి భాగ్యమ్మ రఘు, నాయకులు దుడ్డు కృష్ణ యాదవ్, రాజేందర్ నాయక్, రంజిత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

– పీఆర్ఓ పాష



**ఆమనగల్లు, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో ఈ నెల 16న ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పీఆర్ఓ ఎం.ఏ. పాష తెలిపారు. ఆమనగల్లు మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటిచూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ లేదా రేషన్ కార్డు తమ వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

## వార్డుల సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం -- మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్



**ఆమనగల్లు, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పట్టణంలోని వార్డుల సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ తెలిపారు. మంగళవారం 7వ వార్డులో కౌన్సిలర్ నిరంజన్‌తో కలిసి ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, "వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేపడతాం. సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతాం" అని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలి

-- ఎంపీడీఓ కుసుమ మాధురి



**ఆమనగల్లు, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ కుసుమ మాధురి పిలుపునిచ్చారు.మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐదు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, "మండలంలో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ప్రతి శాఖకు కేటాయించిన పనులను సమగ్ర ప్రణాళికతో అమలు చేసి లక్ష్యాలను సాధించాలి" అని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, వైద్య ఆరోగ్య సేవల విస్తరణ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీవో మాధవరెడ్డి, ఎంఈఓ పాండు, ఏఈ పిఆర్ అభిషేక్, ఏఈ మిషన్ భగీరథ శరత్, యాదయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనిత, ఏవో శ్రీనివాస్ గౌడ్, ఐకెపి ఏపీఎం నీరజ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పట్టుబడిన వాహనాల వేలం

**ఆమనగల్లు, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో బుధవారం వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు.ఆసక్తి కలిగిన వారు ఉదయం 10:30 గంటలకు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో జరిగే వేలం పాటలో ధరావత్ సొమ్ము చెల్లించి పాల్గొనాలని ఆయన సూచించారు.




## ప్రగతి ప్రణాళికలో భాగస్వాములవ్వండి

-- ఎంపీడీఓ కుసుమ మాధురి



**ఆమనగల్లు, మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వం చేపడుతున్న ప్రగతి ప్రణాళికలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీడీఓ కుసుమ మాధురి పిలుపునిచ్చారు.మంగళవారం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చెన్నంపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామ సర్పంచ్ తెల్లమల్ల ప్రశాంతి, రవికుమార్‌లతో కలిసి ఎంపీడీఓ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత. గ్రామాన్ని అన్నిరంగాల్లో మెరుగ్గా తీర్చిదిద్దడానికి ప్రగతి ప్రణాళికను వినియోగించుకోవాలి" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్, ఏపీఓ మాధవరెడ్డి, వార్డు సభ్యులు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

## వివాహ రిసెప్షన్ వేడుకల్లో మేడిగడ్డ నాయకులు



**ఆమనగల్లు, మార్చి 10(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రవీందర్ నాయక్ కుమారుడు మల్లేష్ వివాహ రిసెప్షన్ మంగళవారం రాంనుంతల గేట్ సమీపంలోని డీయంకె ఫంక్షన్ హాల్లో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ వేడుకకు మేడిగడ్డ తండా ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వార్డు సభ్యులు సీతారాం, కవిత, మణిపాల్, సీతి, మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్, నాయకులు భాస్కర్, మణిపాల్, మహేష్, పాండు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరును జాబితా నుంచి తొలగించం

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్



**న్యూఢిల్లీ మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరును కూడా ఓటర్ జాబితా నుంచి తొలగించబోమని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం సీఈసీ బృందం పశ్చిమబెంగాల్‌లో పర్యటించింది. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశాల అనంతరం జ్ఞానేశ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు.పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడటమే ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యమని ఆయన చెప్పారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ఓటర్ల పేర్లు ఎప్పటికీ తొలగించబోమని స్పష్టంచేశారు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారమే అన్ని రాష్ట్రాల్లో 'ప్రత్యేక సమగ్ర సవరణ'అమలవుతుందని అన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడటం, అర్హులైన వారి పేర్లు ఆ జాబితాలో ఉండేలా చూడటమే 'సర్' బాధ్యత అని చెప్పారు. ఇక్కడ ఎన్నికలు ఎన్ని దశల్లో జరుగుతాయనేది రాష్ట్రప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో చేపట్టే చర్యలపైన ఆధారపడి ఉంటుందన్నారు. బెంగాల్ ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలని చెప్పారు.ఓటర్లపైనా, ఎన్నికల అధికారులపైనా రాజకీయ నేతలు ఎలాంటి బెదిరింపులకు పాల్పడినా సహించేది లేదని అన్నారు. పశ్చిమబెంగాల్‌లో దాదాపు 80 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిల్లో దాదాపు 61 వేలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని చెప్పారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించేందుకు రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను అమలుచేయనున్నట్లు తెలిపారు.

# ఇరాన్ సంక్షోభంలోనూ బంగ్లాదేశ్‌కు భారత్ సాయం..

### -5,000 టన్నుల డీజిల్ సరఫరా



**న్యూఢిల్లీ మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇండియా-బంగ్లాదేశ్ మధ్య కొంతకాలం క్రితం విబేధాలు తలెత్తిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవలి కాలంలో ఈ పరిణామాలు కాస్త మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. బంగ్లాదేశ్ అవసరం ఇండియాకు పెద్దగా లేకపోయినా.. ఇండియా అవసరం బంగ్లాకు ఉంది. అదే సమయంలో ఇండియా కూడా బంగ్లాదేశ్ అంశంలో సానుకూలంగానే స్పందిస్తోంది. తాజాగా బంగ్లాదేశ్‌కు ఇండియా 5,000 టన్నుల డీజిల్ సరఫరా చేసేందుకు సిద్ధమైంది. అది కూడా ఒక పక్క ఇరాన్ వార్ జరుగుతుండగా సరఫరా చేయడం విశేషం.గతంలో ఇండియా-బంగ్లాదేశ్ మధ్య చమురు సరఫరాపై ఒప్పందం కుదిరింది. దీనిలో భాగంగా ఇరు దేశాల మధ్య ఫ్రెండ్‌షిప్ పైప్‌లైన్ కూడా నిర్మించారు. అంతకుముందు చమురు సరఫరా రైల్వే ట్యాంకర్ల ద్వారా జరిగేది. బంగ్లాతో ఒప్పందం ప్రకారం ప్రతి ఏడాది బంగ్లాకు 1,80,000 టన్నుల డీజిల్‌ను ఇండియా సరఫరా చేయాలి. ఐదేళ్లపాటు ఈ ఒప్పందం అమలులో ఉంటుంది. దీనిలో భాగంగా తొలి విడతగా 5,000 టన్నుల డీజిల్‌ను ఇండియా బంగ్లాకు సరఫరా చేసింది. మంగళవారం నాటికి ఈ డీజిల్ బంగ్లాకు చేరుకుంటుందని అంచనా. అలాగే వచ్చే ఆరు నెలల్లో 90,000 టన్నుల డీజిల్ సరఫరా అవుతుందని భావిస్తున్నట్లు బంగ్లాదేశ్ పెట్రోలియం కార్పొరేషన్ ఛైర్మన్ ముహమ్మద్ రెజనూర్ రెహమాన్ అన్నారు. ఇది తమ దేశీయ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.నిజానికి ఇండియా ఎప్పటినుంచో బంగ్లాకు చమురు సరఫరా చేస్తోంది. అలాగే, ఇక్కడి నుంచి విద్యుత్‌ను కూడా బంగ్లాక అందించేది. కానీ, రెండేళ్లక్రితం అక్కడ షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయాక పరిస్థితులు మారిపోయాయి. అక్కడ హిందువులపై దాడులు పెరిగిపోయాయి. ఇదే సమయంలో ఇంతకాలం బంగ్లాను నడిపించిన యూనస్ ప్రభుత్వం ఇండియాకు వ్యతిరేకంగా వ్యవహరించింది. ఇండియానుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసింది. అలాగే అదానీ సంస్థకు చెందిన ఝార్ఖండ్ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్ తీసుకోవడాన్ని తగ్గించింది. కానీ, ఇప్పుడు బంగ్లాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో మళ్లీ పాత పద్ధతుల్లోనే ఇండియా-బంగ్లాదేశ్ మధ్య చమురు సరఫరా మొదలైంది.

# మొజ్తాబా ఖమేని ఎక్కడ..?

### -ఇజ్రాయెల్ దాడిలో గాయపడ్డారా..?
### -ఇరాన్ మీడియా హింట్



**న్యూఢిల్లీ మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేనిని ఆ దేశ అసెంబ్లీ ఎన్నుకున్న సంగతి తెలిసిందే. అయితే, సుప్రీం లీడర్‌గా ఎన్నికైన తర్వాత కూడా మొజ్తాబా ఖమేని ఎక్కడా కనిపించడం లేదు. ప్రజల ముందుకు రాలేదు. బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. దీంతో ఆయన ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు చెందిన ఒక అధికారిక టీవీ ఛానెల్ చేసిన ప్రకటన ఇప్పుడు సంచలనంగా మారింది. ఇరాన్ మీడియా మొజ్తాబా ఖమేనిని 'జాన్‌బాజ్ ఆఫ్ రమదాన్' అని అభివర్ణించింది.అంటే యుద్ధంలో గాయపడిన వాడు అని అర్థం. రంజాన్ సమయంలో జరుగుతున్న యుద్ధం కావడంతో కూడా ఇలా వర్ణించింది. యుద్ధంలో శత్రువుల ద్వారా ఖమేని గాయపడినట్లు చేసిన ప్రకటనతో.. ఆయన తాజా యుద్ధంలో గాయపడ్డారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే యుద్ధం ప్రారంభమైన తర్వాత కానీ, తన తండ్రి, భార్య, కుటుంబం మరణించిన తర్వాత కానీ ఆయన ఎప్పుడూ బయట కనిపించలేదు. ఆయనకు సంబంధించిన ఒక ఫొటో, వీడియో కూడా బయటకు రాలేదు. ఆయన్నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. దీంతో ఆయన గాయపడ్డారేమో అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అయితే, ఇరాన్ ఛానెల్ చెప్పినట్లు యుద్ధంలో గాయపడటం అంటే ఆయన శరీరానికి అయిన గాయంగానే పరిగణించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆయన కుటుంబాన్ని కోల్పోవడం కూడా గాయం కిందే లెక్క.దీంతో మొజ్తాబా నిజంగానే గాయపడ్డారా లేదా అనే విషయంలో క్లారిటీ లేదు. ఆయన ఎక్కడున్నారు అనే విషయంలో కూడా స్పష్టత లేదు. ఇక.. మొజ్తాబా ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహంతోనే ఉన్నాడు. అతడి ఎంపికపై అసంతృప్తితో ఉన్న ట్రంప్.. మొజ్తాబా మనశాంతిగా ఉంటాడని తాను భావించడం లేదన్నారు. మొజ్తాబా ఎంపికను తాను అంగీకరించబోనని, అతడి బదులు ఇరాన్‌లో శాంతిని, సామరస్యాన్ని నింపే నాయకుడిని ఎన్నుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డాడు.

# యూరియా పరిశ్రమలకు గ్యాస్ కొరత..

### 60 శాతం సామర్థ్యంతోనే ఉత్పత్తి..!



**న్యూఢిల్లీ మార్చి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పశ్చిమాసియాలో ఇరాన్ -- ఇజ్రాయెల్, అమెరికా మధ్య కొనసాగుతున్న యుద్ధం అంతర్జాతీయంగా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే చమురు ధరలు పెరిగిపోతుండగా.. ఎల్పీజీ గ్యాస్ కొరతతో పలు నగరాల్లో హోటళ్లు మూత పడుతున్నాయి. రైతులకు అత్యవసరమైన యూరియా ఉత్పత్తిపై కూడా పశ్చిమాసియా యుద్ధం పంజా విసురుతోంది. గ్యాస్ లభ్యత తగ్గిన కారణంగా భారతదేశంలో యూరియా ఉత్పత్తి తగ్గుముఖం పడుతోంది.యుద్ధం ప్రభావంతో విదేశాల నుంచి గ్యాస్ లభ్యత తగ్గడం వల్ల భారత్‌లోని యూరియా ప్లాంట్లు పూర్తి స్థాయిలో నడవడం లేదు. కేవలం 60 శాతం సామర్థ్యంతోనే పని చేస్తున్నాయి. ఈ పరిస్థితి మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే, చివరికి దేశంలో యూరియా కొరత వచ్చే అవకాశముందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.